
తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
# జనంసాక్షి
www.janamsakshi.org
ఖమ్మం - నల్లగొండ
భద్రాద్రి కొత్తగూడెం సూర్యపేట
యాద్రాద్రి భువనగిరి
ఆదివారం
23 ఆగష్టు 2026
పేజీలు : 8
Follow :




## మితిమీరిన వేగంతో ఆర్టీసీ అద్దె బస్సులు

### ప్రయాణికుల ప్రాణాలకు ముప్పు..

○మణుగూరు డిపోపై ప్రయాణికుల ఆగ్రహం ?
○వేగ నియంత్రణ, కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్..

**అశ్వాపురం ఆగస్టు 22 (జనంసాక్షి):** మణుగూరు ఆర్టీసీ డిపోకు చెందిన అద్దె బస్సుల మితిమీరిన వేగం ప్రయాణికులు, ఇతర వాహన దారుల్లో భయాందోళన కలిగిస్తోంది. ఆదాయంపై, ఎక్కువ ట్రిప్పులపై దృష్టి సారిస్తూ ప్రజల భద్రతను నిర్లక్ష్యం చేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఒక్కో ట్రిప్పుకు ప్రోత్సాహకాలు, మిగతా 6లో



## బాలబాలికకు భద్రమైన బాల్యాన్ని అందించడం మన బాధ్యత

### జిల్లా న్యాయసేవా సంస్థ చైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి నాగరాజు

**ఖమ్మం కార్పొరేషన్, ఆగస్టు- 22 ( జనంసాక్షి )** ప్రతి చిన్నారికి సురక్షితమైన, భద్రమైన బాల్యాన్ని అందించడం సమాజంలోని ప్రతి ఒక్కరి ప్రాథమిక బాధ్యత అని జిల్లా న్యాయసేవా సంస్థ చైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎం. నాగరాజు పిలుపునిచ్చారు. శనివారం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సమావేశ మందిరంలో జాతీయ న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో పిల్లలకు అనుకూలమైన న్యాయ సేవల పథకం-2024 క్రింద బాలల సంరక్షణ అధికారుల కోసం ఏర్పాటు చేసిన ఒక రోజు ప్రత్యేక అవగాహన సదస్సును జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన న్యాయ మూర్తి మాట్లాడుతూ, తల్లి కోడి తన రెక్కల కింద పిల్లలను పెట్టుకుని ప్రమాదాల నుండి ఎలా ఆప్యాయంగా కాపాడు కుంటుందో, సమాజంలో ఉపాధ్యాయులు కూడా విద్యార్థు లను అదే రీతిలో ప్రేమతో, బాధ్యతతో సంరక్షించాలని అన్నారు. మారుతున్న కాలానికి అనుగుణంగా విద్యార్థులకు చిన్ననాటి నుంచే చట్టాలపై, తమ ప్రాథమిక హక్కులపై స్పష్టమైన అవగాహన కల్పించాలన్నారు. మిగతా 6లో



### రీ-సర్వే డేటా ఎంట్రీ తప్పు లేకుండా

## నమోదు చేయాలి

### కలెక్టర్ దివాకర టిఎస్

**ఖమ్మం కార్పొరేషన్, ఆగస్టు -22 ( జనంసాక్షి ):** రీ?సర్వే డేటా ఎంట్రీలో తప్పులకు తావు లేకుండా జాగ్రత్తగా నమోదు చేయాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ తెలిపారు. కూసుమంచి మండలం భగత్‌వీడు గ్రామంలో కొనసాగుతున్న రీ?సర్వే, డేటా ఎంట్రీ ప్రక్రియను జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ శనివారం పరిశీలించారు. కూసుమంచి తహసీల్దార్ కార్యాలయంలో జరుగుతున్న డేటా ఎంట్రీ ప్రక్రియను పరిశీలించిన కలెక్టర్, సర్వే బృందాలు నమోదు చేస్తున్న వివరాలను క్షేత్రస్థాయి సర్వే వివరాలతో పరిశీలించారు. ఈ సందర్భంగా భగత్‌వీడు గ్రామానికి చెందిన ఎ. వీరభద్రం, కె. శ్రీనివాస రెడ్డి, పసుపులేటి నాగేశ్వరరావు, తదితరుల భూముల సర్వే వివరాలను కలెక్టర్ పరిశీలించారు. జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ మాట్లాడుతూ రీ-సర్వేలో భాగంగా చేపడుతున్న డేటా ఎంట్రీ ప్రక్రియలో సర్వే బృందాలు అత్యంత జాగ్రత్తగా వ్యవహరించాలని సూచించారు. భూ విస్తీర్ణం, హద్దులు, ఇతర వివరాలను ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా ఖచ్చితంగా నమోదు చేయాలని ఆదేశించారు. శాటిలైట్ సాంకేతికతను ఉపయోగించి సర్వే నిర్వహిస్తున్నందున క్షేత్రస్థాయిలో వాస్తవంగా ఉన్న భూ విస్తీర్ణం మేరకే వివరాలు మిగతా 8లో

## జిల్లా కీర్తి పతాకను ఎగురవేసిన అయ్మాన్

### ○జూనియర్ షూటింగ్‌లో బంగారు పతకం.. ○100కి 98 పాయింట్లతో అత్యధిక స్కోర్

### ○అన్నపురెడ్డిపల్లి మండలం గుంపెన కొత్తూరు యువ షూటర్ ఘనత

**అన్నపురెడ్డిపల్లి, ఆగస్టు 22 (జనం సాక్షి):** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా షూటింగ్ క్రీడా చరిత్రలో అన్నపురెడ్డిపల్లి మండలం గుంపెన కొత్తూరు గ్రామానికి చెందిన జూనియర్ షూటర్ అయ్మాన్ ముస్కాన్ పఠాన్ సరికొత్త అధ్యాయాన్ని లిఖించారు. 2వ తెలంగాణ సూపర్ బిగ్ బోర్ పోటీలు?2026లో జూనియర్ మహిళల విభాగంలో బంగారు పతకం సాధించి జిల్లాకు తొలి పతకాన్ని అందించారు. అంతేకాకుండా 100కి 98 పాయింట్లు సాధించి పోటీల్లోనే అత్యధిక స్కోర్ నమోదు చేసి సత్తా చాటారు. తెలంగాణ రైఫిల్ సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 20, 21 తేదీల్లో ఇబ్రహీంపట్నం, తట్టిఖానాలోని ఆక్టోపస్ కమాండో శిక్షణ కేంద్రంలో ఈ పోటీలు నిర్వహించారు. అయ్మాన్ సాధించిన బంగారు పతకాన్ని మాజీ డీజీపీ అంజనీ కుమార్ తెలంగాణ రైఫిల్ సంఘం అధ్యక్షుడు, జాతీయ రైఫిల్ సంఘం ఉపాధ్యక్షుడు అమిత్ సంఘీ, సఫత్ అలీ ఖాన్ చేతుల మీదుగా అందుకున్నారు.

**ఒకే కుటుంబం.. ముగ్గురు షూటర్లు**

అయ్మాన్ ముస్కాన్ పఠాన్‌తో పాటు ఆమె తండ్రి రహీం పఠాన్, సోదరుడు రయాన్ పఠాన్ కూడా పోటీల్లో పాల్గొని తమ తమ విభాగాల్లో అర్హత సాధించడం విశేషం. అయ్మాన్ జూనియర్ మహిళల వ్యక్తిగత విభాగంలో బంగారు పతకం సాధించగా.. రహీం పఠాన్ పురుషుల వ్యక్తిగత విభాగంలో, రయాన్ పఠాన్ జూనియర్ పురుషుల వ్యక్తిగత విభాగంలో అర్హత సాధించారు. ఇప్పటికే తెలంగాణ రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభ కనబరిచిన అయ్మాన్, రయాన్ పఠాన్ తమ తమ .22 రైఫిల్ విభాగాల్లో అఖిల భారత జి.వి. మావలంకర్ షూటింగ్ ఛాంపియన్‌షిప్‌కు అర్హత సాధించారు.

**సౌకర్యాలు లేకున్నా.. కఠోర సాధన**

స్థానికంగా సరైన షూటింగ్ మౌలిక సదుపాయాలు లేకపోయినా అయ్మాన్ తన తండ్రి, కోచ్ అబ్దుల్ నబీ మార్గదర్శకత్వంలో క్రమశిక్షణతో సాధన కొనసాగించారు. డ్రై-ఫైర్ ప్రాక్టీస్, స్కాట్ ఎలక్ట్రానిక్ శిక్షణ వ్యవస్థ, చెక్క బుల్లెట్లతో సాధన చేస్తూ పోటీలకు సిద్ధమయ్యారు. అంకితభావం, నిరంతర సాధనతోనే ఈ విజయాన్ని సాధించినట్లు అయ్మాన్ తెలిపారు.

**శిక్షణ కేంద్రం ఏర్పాటు చేయాలి**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో 50 మీటర్లు, 300 మీటర్ల షూటింగ్ శిక్షణా కేంద్రాలను ఏర్పాటు చేయాలని అయ్మాన్ రాష్ట్ర ప్రభుత్వం, జిల్లా యంత్రాంగాన్ని కోరారు. ఆధునిక సౌకర్యాలతో




శిక్షణ కేంద్రాలు ఏర్పాటైతే జిల్లాలోని యువ క్రీడాకారుల్లో మరింత ప్రతిభ వెలుగులోకి వస్తుందని పేర్కొన్నారు.
తన పిల్లలు జాతీయస్థాయి పోటీలకు అర్హత సాధించడం పట్ల తండ్రి రహీం పఠాన్ ఆనందం వ్యక్తం చేశారు. ఈ విజయానికి సహకరించిన తెలంగాణ రైఫిల్ సంఘం అధ్యక్షుడు అమిత్ సంఘీ, సంయుక్త కార్యదర్శులు జె. కిరణ్, రాజ్‌కుమార్, కోచ్ అబ్దుల్ నబీ, బోర్డు సభ్యులు అడ్వకేట్ శ్రవణ్, వంశీ, ఎ. కిరణ్ తదితరులకు పఠాన్ కుటుంబం కృతజ్ఞతలు తెలిపింది.
జిల్లాకు తొలి సూపర్ బిగ్ బోర్ షూటింగ్ పతకాన్ని అందించడంతో పాటు 98/100 స్కోర్‌తో అయ్మాన్ సాధించిన ఘనతపై క్రీడాభిమానులు, గ్రామస్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

# మందలపల్లి ఎక్స్ రోడ్డు వద్ద బిఆర్ఎస్ ఆధ్వర్యంలో రాస్తారోకో

## జీవో 97 ను రద్దు చెయ్యాలని డిమాండ్



**దమ్మపేట ఆగస్టు 22 (జనంసాక్షి):** జీవో 97 ను రద్దు చేయాలని మందలపల్లి ఎక్స్ రోడ్డు వద్ద బిఆర్ఎస్ విద్యార్థి విభాగం యువజన విభాగం ఆధ్వర్యంలో రాస్తారోకో నిర్వహించి నిరసన కార్యక్రమం చేపట్టారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు రేగ కాంతారావు, అశ్వారావుపేట నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే ,బిఆర్ఎస్ పార్టీ ఇంచార్జ్ మెచ్చా నాగేశ్వరరావు పిలుపుతో దమ్మపేట మండలం,మందలపల్లి ఎక్స్ రోడ్డు వద్ద జాతీయరహదారి పై రాస్తా రోకో చేపట్టి నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం విడుదల చేసిన జీవో నంబర్ 97 రాష్ట్రంలోని పాలిటెక్నిక్ డిప్లమా విద్యా వ్యవస్థను కళాశాలలను యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీ,శక్తి స్కీమ్‌లో విలీనం చేయడానికి ప్రతిపాదించిన నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ తెలంగాణవ్యాప్తంగా పాలిటెక్నిక్ విద్యార్థులు పెద్ద ఎత్తున ఆందోళనలు,ధర్నాలు నిర్వహిస్తున్నారు. ఈ పోరాటానికి బిఆర్ఎస్ పార్టీ పూర్తి మద్దతు తెలుపుతూ ఈరోజు రాస్తారోకో నిర్వహించారు. సాంకేతిక విద్యా విభాగాన్ని ప్రత్యేకంగా ఉంచి, ప్రభుత్వమే పాలిటెక్నిక్ విద్యా వ్యవస్థను బలోపేతం చేయాలనీ ఈ సందర్భంగా ప్రభుత్వాన్ని డిమాండ్ చేసారు. ఈ కార్యక్రమంలో విద్యార్థి విభాగం నియోజకవర్గ మాజీ అధ్యక్షులు వెంపటి భరత్ కుమార్, నియోజకవర్గ యువజన విభాగ మాజీ కార్యదర్శి యార్లగడ్డ శ్రీనివాసరావు, మండల యూత్ మాజీ అధ్యక్షులు మండవ సత్య,మండల నాయకులు దారా యుగుందర్,నాయకపోడు సంఘం రాష్ట్ర నాయకులు రావుల శ్రీనివాసరావు,ఆళ్ల జంగం,మండల మాజీ ఉపాధ్యక్షులు గాజుబోయిన యేసుబాబు,తుమ్మల లక్ష్మణరావు,సర్పంచ్ సోయం సత్యవతి,ఊప సర్పంచ్ ముత్తిన రామకృష్ణ,మాజీ ఎంపీటీసీ కాసిని శ్రీను,మాజీ కో ఆప్షన్ ఎంపీటీసీ బుడే,అబ్దుల్ జిన్న,వెలుగోటి మహేష్,వార్డు సభ్యులు దారా రాము,రూప రాంబాబు,ఉయ్యాల లక్ష్మీ నారాయణ, మండల సెల్ నాయకలు మద్దెల పుల్లారావు,కొలిపోగు ధర్మ,బీసీ మండల నాయకులు తాళ్ల వెంకటేశ్వరావు,పాకనాటి శ్రీను, వల్లెపు నాగేశ్వరావు, పాశ్యం ప్రసాద్,బండి ప్రసాద్,బాకీ శ్రీను,కొల్లి శేఖర్,నడిపల్లి పోలయ్య, అడపా నరసయ్య నాయుడు,దోద్దుల వెంకన్న,తాళ్ల శివ,చక్రాల పోలరాజు, తదితరులు పాల్గొన్నారు.




## రేపు అడవిమల్లెల గురుకుల పాఠశాల. కళాశాలలో స్పాట్ అడ్మిషన్లు- ఇన్చార్జి ప్రిన్సిపల్ నాగ శిరోమణి



**పెనుబల్లి, ఆగస్టు 22( జనంసాక్షి)** పెనుబల్లి మండలం అడవి మల్లెల గురుకుల సాంఘిక సంక్షేమ పాఠశాలలో ఈనెల 24న స్పాట్ అడ్మిషన్లు నిర్వహించబడతాయని ఇన్చార్జి ప్రిన్సిపల్ నాగ శిరోమణి ప్రకటన విడుదల చేశారు. టిజిఎస్ డబ్ల్యుఆం ఈఐఎస్ హైదరాబాద్ ఆదేశానుసారం అడవి మల్లెల పాఠశాల/కళాశాల లోని అన్ని తరగతులలొ మిగిలి ఉన్న సీట్ల భర్తీ కి సోమవారం ఉదయం 10.30 గంటలకు స్పాట్ అడ్మిషన్స్ నిర్వహిస్తామని, ఆమె తెలిపారు. ఇంటర్ సీట్లు మెరిట్ ఆధారంగా, మిగతా అన్ని తరగతులకు సీట్లు లాటరీ ప్రాతిపదికన ఎంపిక చేయడం జరుగుతుందని, అభ్యర్థులు వారి దరఖాస్తునకు మార్క్స్ మెమో, టీసీ,క్యాస్ట్,ఇన్కమ్, ఆధార్ కాపీ, డేట్ అఫ్ బర్త్ సర్టిఫికెట్, పాస్పోర్ట్ ఫోటోలు 5 తీసుకొని స్పాట్ అడ్మిషన్ కి రావలసిందని తెలియజేసినారు. ఇంటర్ సీట్లు మెరిట్ ఆధారంగా, మిగతా అన్ని తరగతులకు సీట్లు లాటరీ ప్రాతిపదికన ఎంపిక చేయడం జరుగుతుందని, అభ్యర్థులు వారి దరఖాస్తునకు మార్క్స్ మెమో, టీసీ క్యాస్ట్ ఇన్కమ్, ఆధార్ కాపీ డేట్ అఫ్ బర్త్ సర్టిఫికెట్, పాస్పోర్ట్ ఫోటోలు 05 తీసుకొని స్పాట్ అడ్మిషన్ కి రావలసిందని తెలియజేసినారు. 5వ తరగతి లో 15. 7 వ తరగతి లో 4. 9వ తరగతి లో 1. ఇంటర్ మొదటి సంవత్సరం ఎంపీసీ నందు 14. బైపీసీ నందు 3 ఖాళీ గా ఉన్నాయని. 4, 9వ తరగతి లో 1.ఇంటర్ మొదటి సంవత్సరం ఎంపీసీ నందు 14. బైపీసీ నందు 3 ఖాళీ గా ఉన్నాయని తెలిపారు. ఈ అవకాశన్ని విద్యార్థులు ఉపయోగించుకోగలరని ఇంచార్జ్ ప్రిన్సిపాల్ నాగ శిరోమణి తెలిపారు.

# ఉత్తమక్రమశిక్షణ విలువలతోకూడిన విద్యను అభ్యసించాలి

## పి ఎస్ ఆర్ ట్రస్ట్ సౌజన్యంతో విద్యార్థులకు ప్లేట్లు గ్లాసులు పంపిణీ :కల్లూరు ఏసిపి వసుంధర యాదవ్

**కల్లూరు ఆగస్టు 22(జనంసాక్షి)** ప్రతి విద్యార్థి ఉత్తమ క్రమశిక్షణ విలువలతో కూడిన విద్యను అభ్యసించినప్పుడే ఉన్నత స్థాయికి ఎదగటానికి దోహదపడుతుందని కల్లూరు ఏసిపి వసుంధర యాదవ్ అన్నారు. శనివారం స్థానిక జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో విద్యార్థినిలకు పీఎస్ఆర్ ట్రస్ట్ నిర్వాకురాలు రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి సతీమణి పొంగులేటి మాధురి 250 ప్లేట్లు గ్లాసులు, బాలికలకు సానిటరీ ఫ్యాడ్స్ వితరణగా అందించగా ఏసిపి వసుంధర యాదవ్, ఎంఈఓ పొదిలి పద్మ, మున్సిపల్ చైర్మన్ ధరావత్ మోహన్ నాయక్ తో కలిసి విద్యార్థులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జరిగిన సభలో వసుంధర యాదవ మాట్లాడుతూ విద్యార్థులు కేవలం అత్యధిక మార్కులు సాధించటం కోసం పోటీపడి చదవడం కాకుండా స్కిల్స్ డెవలప్మెంట్ చేసుకుంటూ అధ్యయనంతో ఇష్టపడి కష్టపడి చదివితే ఏదైనా సాధించవచ్చునని అన్నారు. ప్రభుత్వం ఎన్నో రకాలుగా విద్యార్థులకు సౌకర్యాలు కల్పిస్తూ ఉచిత విద్యను అందిస్తుందని దాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. చిన్నతనం నుండే క్రమ శిక్షణ తో మెలుగుతూ గురువులను, తల్లిదండ్రులను గౌరవించడం అలవర్చుకోవాలని అన్నారు. విద్యార్థి దశ ఎంతో ప్రాముఖ్యత మైనదని దాన్ని ప్రతి విద్యార్థిని సద్వినియోగం చేసుకొని ఉన్నత స్థాయి లక్ష్యంగా చేసుకొని చదువుకోవాలని కోరారు. ఇదే తరుణంలో కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఎసిపి వసుంధర యాదవ్, కల్లూరు ఎస్సై డి హరితలను శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ పాఠశాల ప్రధానోపాధ్యాయులు పొదిల పద్మ, మున్సిపల్ వైస్ చైర్పర్సన్ శీలం కోటేశ్వరి, ఎస్ ఐ డి హరిత, కౌన్సిలర్ యాసా నాగమణి శ్రీకాంత్ కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు ఉస్మాన్ ,మైనార్టీ సెల్ నాయకులు షేక్ బాజీ భాయ్ పాఠశాల ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.





## మండల ఉపసర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడిగా మోహన్‌రావు ఏకగ్రీవ ఎన్నిక

**బూర్గంపహాడ్ ఆగస్టు 22 (జనంసాక్షి)** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, బూర్గంపహాడ్ మండల ఉప సర్పంచ్‌ల ఫోరం ఎన్నికలు సారపాక రైతు వేదికలో నిర్వహించారు. జిల్లా ఉప సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు మహంకాళి రామారావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో బూర్గంపహాడ్ మండల ఉప సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడిగా బి. మోహన్‌రావును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతన కార్యవర్గంలో ఉపాధ్యక్షుడిగా తోటమల్ల వెంకటరమణ, ప్రధాన కార్యదర్శిగా అప్పిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, ఆర్గనైజింగ్ సెక్రటరీగా పొదేం సుధాకర్, కోశాధికారిగా పండగ సౌజన్య ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గం మండలంలోని ఉప సర్పంచ్‌ల ఐక్యతను బలోపేతం చేయడంతో పాటు వారి హక్కుల సాధన, గ్రామాల అభివృద్ధి కోసం సమిష్టిగా కృషి చేయాలని ఆకాంక్షించారు. నూతన కార్యవర్గానికి పలువురు అభినందనలు, శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కన్నీదారి రమేష్, మోడెం రాధాకృష్ణ, కేశనపల్లి బేబీ, సున్నం కృష్ణవేణి, సీహెచ్. కుమారి తదితరులు పాల్గొన్నారు.

# జీవో నెం 97ను వెంటనే రద్దు చెయ్యాలి



అశ్వారావుపేట ఆగస్టు 22 (జనంసాక్షి): పాలిటెక్నిక్ విద్యార్థుల భవిష్యత్‌కు నష్టం కలిగించేలా రాష్ట్ర ప్రభుత్వం తీసుకువచ్చిన జీవో 97ను తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఃఖీూ పార్టీ అధ్యక్షులు రేగ కాంతారావు గారు మరియు అశ్వారావుపేట నియోజకవర్గ మాజీ ఓఒం,ఃఖీూ మెచ్చా నాగేశ్వరరావు పిలుపుమేరకు విద్యార్థి విభాగం, యువజన విభాగం ఆధ్వర్యంలో పాలిటెక్నిక్ విద్యార్థుల భవిష్యత్‌ను దెబ్బతీసే జీవో 97ను వెంటనే రద్దు చేయాలి డిమాండ్ చేస్తూ. అశ్వారావుపేట లోని స్థానిక తహసిల్దార్ కార్యాలయం వద్ద నిరసన కార్యక్రమం నిర్వహించిన అశ్వారావుపేట బిఆర్ఎస్ నాయకులు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతి ఒక్క విషయంలో ఒంటెద్దు పోకడా గా వ్యవహరిస్తూ తెలంగాణ రాష్ట్రంన్నీ సర్వ నాశనం చేస్తున్నారని, విద్యార్థుల పట్ల కనీస అవగాహనతో ఆలోచించ కుండా విద్య వ్యవస్థను ఇష్టం వచ్చినట్టు మార్చేసి జీవోలను విడుదల చేస్తూ విద్యార్థుల జీవితాలతో ఆడుకుంటే ప్రతిపక్ష పాత్ర లో ఉన్న బిఆర్ఎస్ పార్టీ చేతులు కట్టుకొని ఉండదని విద్యార్థుల కొరకు పోరాటం చేయటానికి సిద్ధంగా ఉందని ఈ సందర్భంగా తెలియజేశారు. తక్షణమే ప్రభుత్వం వెంటనే ఈ జీవో97ను వెనక్కి తీసుకోవాలి. డిప్లొమా పూర్తి చేసిన విద్యార్థులకు నేరుగా బీటెక్ సెకండ్ ఇయర్‌లో చేరే లేటరల్ ఎంట్రీ (ఇఅఖ ద్వారా) అవకాశం యథావిధిగా కొనసాగించాలి. జీవో ప్రకారం మళ్లీ ఇంటర్మీడియట్ చదివి ఎంసెట్ రాయాల్సి వస్తే విద్యార్థులు మూడు సంవత్సరాల చదువు వృధా అవుతుందని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో అశ్వారావుపేట మండల కో ఆర్డినేటర్ జూపల్లిరమణ రావు,మున్సిపాలిటీ కౌన్సలర్ ఉదయ జ్యోతి, అచ్యుతాపురం ఉప సర్పంచ్ పాకనాటి నాగేశ్వరరావు, నారాంవారిగూడెం ఉప సర్పంచ్ రాంబాబు,మాజీ ఎంపీపీ జల్లిపల్లి శ్రీరామమూర్తి,జూ ప్రకాష్ రావు,మందపాటి రాజా మోహన్ రెడ్డి, నారం రాజశేఖర్, కాసాని చంద్రమోహన్, భూక్యా.ప్రసాద్, జుజ్జురపు.శ్రీరామమూర్తి, సత్యవరపు. సంపూర్ణ, జజ్జురపు. వెంకన్నబాబు, కలపాల. దుర్గయ్య, ధర్మ, వెంకన్నబాబు, అంజి,కుప్పాల. కృష్ణ,కలపాల. సురేష్, లింగంకుంట. కృష్ణా, అమిర్, నారాయణ,గంగాధర్, ధర్మ, తగరం. జగన్నాథం, సంకుల.స్వరూప, ఉస్మాన్, జ్యోత్స్నభాయి,రాంబాబు, సోమాని. రమేష్, బాలి. కిరణ్,గోవింద్,మోహన్,అశ్వారావుపేట మండల నాయకులు కార్యకర్తలు,మాజి ప్రతినిధులు అలాగే విద్యార్థి విభాగం,యువజన విభాగం నాయకులు అభిమానులు విద్యార్థులు పాల్గొని నిరసన కార్యక్రమాన్నీ విజయవంతం చేశారు..

## రైతులకు దీర్ఘకాలిక రుణాలు



**చౌటుప్పల్ ఆగస్టు 21(జనంసాక్షి)**
ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి చౌటుప్పల్ పరిధిలో రైతులకు రూ. 1.50 లక్షల వరకు దీర్ఘకాలిక రుణాలు అందిస్తున్నామని సంఘం చైర్మన్ చింతల దామోదర్ రెడ్డి తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ ఈ దీర్ఘకాలిక రుణాల కింద ట్రాక్టర్లు, వరి కోత మిషన్లు, కోళ్ల ఫారాలు, డెయిరీ ఫారాలు, గొర్రెల పెంపకానికి రుణాలు మంజూరు చేయనున్నట్లు ఆయన పేర్కొన్నారు. రుణాలు కావాల్సిన అర్హులైన రైతులు చౌటుప్పల్‌లోని సంఘ కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

## అస్వస్థతకు గురైన ముగ్గురు కాంట్రాక్ట్ ఉద్యోగులను ఆసుపత్రికి తరలింపు



**చింతలపాలెం(జనంసాక్షి)**
పులిచింతల జెన్‌కోలో ఔట్‌సోర్సింగ్ కాంట్రాక్ట్ ఉద్యోగులు చేపట్టిన ఆమరణ నిరాహార దీక్ష పదో రోజుకు చేరింది.దీక్ష చేస్తున్న వాళ్లలో ముగ్గురు ఉద్యోగుల ఆరోగ్య పరిస్థితి క్షీణించడంతో చింతల పాలెం తహసీల్దార్ రామకృష్ణారెడ్డి, చింతలపాలెం సబ్ ఇన్స్పెక్టర్ పరమేష్, మేళ్లచెరువు పీహెచ్‌సీ వైద్యాధికారి ఆధ్వర్యంలో వారికి వైద్య పరీక్షలు నిర్వహించారు.వైద్యుల సూచన మేరకు మెరుగైన చికిత్స కోసం ముగ్గురు ఉద్యోగులను బలవంతంగా హుజూర్‌నగర్ ఏరియా ఆసుపత్రికి తరలించారు. ఉద్యోగుల ఆరోగ్య పరిస్థితిపై అధికారులు, వైద్య సిబ్బంది ప్రత్యేక దృష్టి సారించారు.ముగ్గురిలో ఒకరి ఆరోగ్యం బాగా క్షీణించి షుగర్ లెవల్ భారీగా పడిపోవడంతో వైద్యం కొనసాగిస్తున్నారు, పది రోజులుగా ఆమరణ నిరాహార దీక్ష కొనసాగిస్తున్న నేపథ్యంలో కనీసం ప్రభుత్వం స్పందించ కపోవడం చాలా బాధాకరమని గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు. ఈ విషయంపై జెన్కో ఎస్ఈ దేశ్యా నాయక్ ని బాధిత కుటుంబాలు కలిసి వాళ్ళకి ఏమైనా అయితే మీదే బాధ్యత అని వ్రాతపూర్వకంగా ఇచ్చారు.ఈ విషయం పై ప్రభుత్వం ఏ విధంగా స్పందిస్తుందో వేచి చూడాలి.

## ఓటు హక్కును కాపాడుకుందాం

### - కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు గెల్లి రవి

**హుజూర్‌నగర్, ఆగస్టు 22 (జనంసాక్షి) :**
మంత్రి ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి ఆదేశాల మేరకు హుజూర్‌నగర్ పట్టణంలోని ఆయన క్యాంప్ కార్యాలయంలో సర్ లో భాగంగా బూత్ లెవల్ ఏజెంట్ల (బిఎల్ఏ ) సమావేశం హుజూర్ నగర్ కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు గెల్లి రవి ఆధ్వర్యంలో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హుజూర్‌నగర్ నియోజకవర్గంలో కొత్తగా వచ్చిన ఓటర్ లిస్టులో ఉన్న డబుల్ ఓట్లు, చనిపోయిన వారి ఓట్లు, అసలు ఓటు ఉండి రాని వాటిని సవరణ చేయించేందుకు బూత్ ఓటర్ లిస్టును బిఎల్ఏ లకు అందజేశారు. ఈ ప్రజాస్వామ్య దేశంలో ఓటు అనేది మన హక్కు, ఆ ఓటును కాపాడుకుందామని నాయకులు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో హుజూర్‌నగర్ పట్టణ అధ్యక్షులు గెల్లి రవి, నియోజకవర్గ సర్ వీఆర్వో చిలక కిషోర్, వివిధ మండల అధ్యక్షులు, టౌన్ అధ్యక్షులు, బిఎల్ఏ లు పాల్గొన్నారు.



## గ్రామాల అభివృద్ధి, మౌలిక వసతులపై మండల స్థాయి సమీక్ష



**తిరుమలగిరి (సాగర్) ఆగస్టు 22 (జనంసాక్షి):**
మండల స్థాయిలో గ్రామాల అభివృద్ధి, సామర్థ్యాల నిర్వహణ కార్యక్రమాలపై మండల స్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు. మండల ప్రత్యేక అధికారి ఎం. సరిత, ఏ.డీ.ఏ. అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ఎజెండా వారీగా వివిధ అంశాలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామాల్లో తాగునీటి సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని సర్పంచ్‌లకు సూచించారు. విద్యుత్ సమస్యల పరిష్కారంలో భాగంగా అన్ని గ్రామాల్లో థర్డ్ వైర్ ఏర్పాటు చేయాలని సర్పంచ్‌లు సంబంధిత విద్యుత్ శాఖ ఏఈ వెంకటరెడ్డిని కోరారు. ఫారెస్ట్ భూములు, అసైన్డ్ భూములకు సంబంధించి గ్రామాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని నెల్లికల్, తూటిపేట తండా సర్పంచ్‌లు కోరారు. ఈ సమస్యలపై స్థానిక తహసీల్దార్‌ను సంప్రదించి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సమావేశంలో సూచించారు. అన్ని శాఖల పరిధిలోని సమస్యలను సమీక్షించి, వాటి పరిష్కారానికి సమన్వయంతో చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. సమావేశంలో తహసీల్దార్ అనిల్, ఎంఈఓ శ్రీనివాస్, ఎంపీడీఓ వెంకటయ్య, విద్యుత్ శాఖ ఏఈ వెంకటరెడ్డి, వెటర్నరీ డాక్టర్ పరశురాం తదితర మండల స్థాయి అధికారులు మండల సర్పంచుల ఫోరం అధ్యక్షుడు శ్రీను నాయక్ పాల్గొన్నారు.సమావేశానికి హాజరుకాని ఫారెస్ట్, ఆర్అండ్‌బీ, ఎస్సీ సంక్షేమ శాఖ అధికారులపై చర్యలు తీసుకోవాలని సమావేశంలో తీర్మానించారు.

## హైజంప్ లో స్వర్ణ పతకం సాధించిన - వరుణ్ సాయి

**చిలుకూరు,ఆగస్టు 22 (జనంసాక్షి):**
మండల కేంద్రంలోని మహాత్మా జ్యోతిబాపూలే గురుకులంలో చదువుతున్న 7వ తరగతి విద్యార్థి యు వరుణ్ సాయి అండర్-14 విభాగం హైజంప్‌లో స్వర్ణ పతకం సాధించి ప్రతిభ కనబరిచాడు. 12వ తెలంగాణ రాష్ట్ర జూనియర్స్ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్స్ (బాలురుబాలికలు) సౌత్ జోన్ పోటీలకు సంబంధించి జిల్లా స్థాయి హైజంప్‌లో వరుణ్ సాయి అద్భుత ప్రతిభ కనబరిచి ప్రథమ స్థానాన్ని సాధించడంతో రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు సూర్యాపేట జిల్లా తరఫున ఎంపికయ్యాడు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ సిహెచ్ వీరయ్య మాట్లాడుతూ రాష్ట్రస్థాయి పోటీల్లో కూడా అత్యుత్తమ ప్రతిభ కనబరిచి విజయం సాధించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఏటీపీ బ్రహ్మచారి,పీఈటీలు రాజ్ కుమార్, మట్టయ్య, ఉపాధ్యాయులు,విద్యార్థులు హర్షం వ్యక్తం చేసి అభినందించారు.







## పట్టుపురుగుల యాజమాన్య పద్ధతులపై అవగాహన సమావేశం..

**కనగల్లు, ఆగస్టు 22 (జనంసాక్షి)**
మండలంలోని నరసింహపురం గ్రామంలో అగ్రికల్చర్ మేనేజ్మెంట్ ఏజెన్సీ (ఆత్మ) ఆధ్వర్యంలో ఆర్ పి ఎల్ (రికగ్నైజ్డ్ ప్రియ లెర్నింగ్) కార్యక్రమంలో భాగంగా పట్టు పురుగులు తోటలను పెంచే రైతులతో శనివారం అవగాహన సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా ఆత్మ చైర్మన్ గోలి జగాల్ రెడ్డి హాజరై మాట్లాడుతూ పట్టుపురుగులు పెంపకంతో రైతుల ఆదాయం మెరుగుపడుతుందని, పట్టుపురుగుల ను పెంచుకునే రైతులకు ప్రభుత్వం సబ్సిడీతో రుణాలను ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. రిసోర్స్ పర్సన్ జిల్లా పుండరీకం మాట్లాడుతూ తీసుకోవాల్సిన జాగ్రత్తలు, యాజమాన్య పద్ధతులు, ప్రభుత్వం కల్పించే రాయితీలు, పండిన పంటకు మార్కెట్ సౌకర్యం, వాటి నుంచి వచ్చే ఆదాయ వనరులపై రైతులకు అవగాహన కల్పించారు. అనంతరం రైతులతో కలిసి పట్టుపురుగుల తోట ప్రదేశానికి వెళ్లి పరిశీలించారు. ఏడిఏ పి గిరి ప్రసాద్ హార్టికల్చర్ ఏడిఏ నరసింహారెడ్డి, మండల వ్యవసాయ అధికారి బి అమరేందర్ గౌడ్, నల్లగొండ ఏవో పి శ్రీనివాస్, తిప్పర్తి ఏవో సన్నీ రాజ్, హార్టికల్చర్ అధికారి అనంతరెడ్డి చెట్ల చెన్నారం సర్పంచ్ రావుల మల్లేష్, తుర్కపల్లి సర్పంచ్ కటికనేని నలినీ వెంకటేశ్వరరావు, పోషమల్ల సురేష్, వ్యవసాయ విస్తరణ అధికారులు, ఉద్యాన శాఖ అధికారులు, రైతులు పాల్గొన్నారు.

## ఓబీసి జిల్లా ఉపాధ్యక్షుడిగా వెంకటేశ్వర్లు



**జాజిరెడ్డిగూడెం ఆగస్టు 22 (జనంసాక్షి)**
బిజెపి ఓబీసీ జిల్లా మోర్చా ఉపాధ్యక్షుడిగా జాజిరెడ్డిగూడెం మండల కేంద్రానికి చెందిన కీర్తి వెంకటేశ్వర్లును నియమిస్తూ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు గండమల్ల ఆనంద్ గౌడ్, జిల్లా అధ్యక్షుడు కట్టుకోజు నాగేంద్ర చారి, శనివారం ఉత్తర్వులు జారీ చేసారు.వెంకటేశ్వర్లు ఇప్పటికే ఓబీసి మోర్చా నియోజకవర్గ కన్వీనర్ గా పనిచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తన నియమించిన రాష్ట్ర, జిల్లా అధ్యక్షులు ఆనంద్ గౌడ్, నాగేంద్రచారిలకు కృతజ్ఞతలు తెలిపారు.

# పెద్దవూర మండల పీఆర్టీయూ నూతన కార్యవర్గం ఏకగ్రీవ ఎన్నిక

- అధ్యక్షుడిగా దండా వీరారెడ్డి, ప్రధాన కార్యదర్శిగా కాసం శ్రీనివాస్
- ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్న నూతన నాయకత్వం

**పెద్దవూర ఆగస్టు 22 (జనంసాక్షి)**
పెద్దవూర మండల పీఆర్టీయూ (ఖఖీజ) నూతన కార్యవర్గాన్ని శనివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షులు కాలం నారాయణరెడ్డి, కార్యదర్శి మేకల జానారెడ్డిల సమక్షంలో ఈ ఎన్నికల ప్రక్రియ నిర్వహించబడింది.మండల అధ్యక్షుడిగా దండా వీరారెడ్డి, ప్రధాన కార్యదర్శిగా కాసం శ్రీనివాస్ ఎన్నికయ్యారు.
నూతన కార్యవర్గ సభ్యుల వివరాలుఅసోసియేట్ అధ్యక్షులు: మలిగిరెడ్డి సురేష్‌రెడ్డిమహిళా అసోసియేట్ అధ్యక్షురాలు: జమ్మికుంట చంద్రకళ ఉపాధ్యక్షులు: మేదరి దేవేందర్, పి. వెంకటేశంమహిళా ఉపాధ్యక్షులు: ఎస్కే జహీదా, ఎస్కే మేహ జాబికార్యదర్శులు: వై. నరేందర్, ఎస్కే రహీం పాషా
మహిళా కార్యదర్శులు: షహనాజ్, శ్రీదేవిఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మాట్లాడుతూ... మండలంలోని ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించేందుకు నిరంతరం శ్రమిస్తామని స్పష్టం చేశారు. ఉపాధ్యాయుల హక్కుల సాధన, సమస్యల పరిష్కారంలో సంఘం తరఫున అందరినీ సమాయత్తం చేస్తూ ఐక్యంగా ముందుకు సాగుతామని తెలిపారు.మండల పీఆర్టీయూ నూతన కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నిక కావడం పట్ల మండల ఉపాధ్యాయులు హర్షం





వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి (ఓఇూ) తరి రాములు, పీఆర్టీయూ నాయకులు, మాజీ అధ్యక్షులు ఇరుమాది పాపిరెడ్డి, మాజీ ప్రధాన కార్యదర్శి దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# వర్షాభావంతో రైతులు నష్టపోకుండా తక్షణ చర్యలు చేపట్టాలి..

## తెలంగాణలో ఫసల్ బీమా యోజనను వెంటనే అమలు చేయాలి:ధరణిపతి రమణారావు..

**చింతపల్లి, ఆగస్టు 22(జనంసాక్షి)**
రాష్ట్రంలో వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో చిన్న, సన్నకారు, కౌలు రైతులను ఆదుకునేందుకు ప్రభుత్వం తక్షణ చర్యలు చేపట్టాలని బీజేపీ మాజీ రాష్ట్ర కిసాన్ మోర్చా కార్యవర్గ సభ్యుడు, మాజీ ఉపసర్పంచ్ ధరణిపతి రమణారావు డిమాండ్ చేశారు. ఈ మేరకు ముఖ్యమంత్రికి లేఖ రాశారు. ఆశించిన స్థాయిలో వర్షాలు లేక రైతులు ఆందోళన చెందుతున్నారని, పంటల కోసం పెట్టుబడులు పెట్టిన రైతులు నష్టపోయే ప్రమాదం ఉందన్నారు. సాగులో ఉన్న పంటలను కాపాడేందుకు అవసరమైన ప్రాంతాలకు సాగునీటిని విడుదల చేయడంతో పాటు ప్రాజెక్టులు, రిజర్వాయర్లలో నీటి నిల్వలపై స్పష్టమైన ప్రణాళిక ప్రకటించాలని కోరారు.రైతులకు పంట నష్టాల నుంచి రక్షణ కల్పించేందుకు ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన ను తెలంగాణలో వెంటనే అమలు చేయాలని రమణారావు డిమాండ్ చేశారు. వర్షాభావం, అధిక వర్షాలు, వరదలు వంటి ప్రకృతి వైపరీత్యాల వల్ల పంటలు నష్టపోయిన రైతులకు బీమా పరిహారం అందేలా చర్యలు చేపట్టాలని కోరారు.వర్షాభావ ప్రాంతాల్లో ప్రత్యామ్నాయ పంటలు, డ్రిప్, స్ప్రింక్లర్ సాగుపై రైతులకు అవగాహన కల్పించాలని, ప్రతి మండలంలో వ్యవసాయ, నీటిపారుదల అధికారులతో రైతుల సమావేశాలు నిర్వహించి పంటల సాగుపై స్పష్టమైన మార్గదర్శకాలు ఇవ్వాలని ఆయన సూచించారు. పరిస్థితులు మరింత తీవ్రతరం



అయితే ముందస్తు కరువు, కాంటింజెన్సీ యాక్షన్ ప్లాన్ అమలు చేయాలని డిమాండ్ చేశారు.



## పారదర్శక పాలనలో స్మార్ట్ రేషన్ కార్డు పంపిణీ ప్రారంభం..

**కనగల్లు, ఆగస్టు 22 (జనంసాక్షి)**
పారదర్శక పాలనలో స్మార్ట్ రేషన్ కార్డు జారీ ప్రక్రియ ఓ బృహత్తరమైన కార్యక్రమమని సర్పంచ్ అందుగుల సువర్ణ వెంకటేశం అన్నారు. శనివారం రామచంద్రపురం గ్రామ సచివాలయం ఆవరణలో లబ్ధిదారులతో కలిసి స్మార్ట్ రేషన్ కార్డ్ పంపిణి కార్యక్రమాన్ని ప్రారంభించారు. సందర్భంగా ఆమె మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన నాటి నుండి ప్రభుత్వం తీసుకున్న ప్రతి నిర్ణయం పేద ప్రజల సంక్షేమ కోసమేనని ఆమె అన్నారు. గొప్పోడు లాగానే పేదవాడు కూడా మూడు పూటలా మంచి భోజనం చేయాలని ఉద్దేశంతో సన్న బియ్యం పథకం తెచ్చి అమలు చేస్తుందని. పది సంవత్సరాలు పాలన చేసిన టిఆర్ఎస్ ప్రభుత్వం ఒక్క రేషన్ కార్డు కూడా ఇవ్వలేదని కాంగ్రెస్ ప్రభుత్వంలో అరులైన ప్రతి ఒక్కరికి రేషన్ కార్డు తో పాటు కుటుంబ సభ్యులలో నమోదు కాని వారసుల పేర్లను కూడా నమోదు చేసి వారికి స్మార్ట్ రేషన్ కార్డు ఇవ్వడం జరుగుతుందన్నారు. స్మార్ట్ రేషన్ కార్డు ద్వారా రేషన్ సరుకులు పారదర్శకంగా అందుతాయని పేర్కొన్నారు. ఆయా కార్యక్రమాలలో సర్పంచు లు పర్సనబోయిన వెంకటేష్, జి పి ఓ లు బి పర్వతాలు, ప్రసాదు, పంచాయతీ కార్యదర్శులు ప్రభు వర్ధన్ రెడ్డి చిత్రం రమేష్ లబ్ధిదారులు, తదితరులు పాల్గొన్నారు.



## జీవో 97ను తక్షణమే రద్దు చేయాలి

### చేవెళ్ల డిక్లరేషన్ హామీలను అమలు చేయాలి

### కలెక్టర్‌కు ఎమ్మార్పీఎస్ వినతి

**నల్గొండ, ఆగస్టు 22 (జనంసాక్షి)**
పాలిటెక్నిక్ కళాశాలలను శక్తి (కార్మిక) శాఖ పరిధిలోకి తీసుకురావడంతో పాటు స్కిల్స్ యూనివర్సిటీకి అనుసంధానం చేస్తూ ప్రభుత్వం జారీ చేసిన జీవో నంబర్ 97ను తక్షణమే రద్దు చేయాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు జిల్లా వెంకటేష్ మాదిగ డిమాండ్ చేశారు. శనివారం ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో నల్గొండ జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్‌కు వినతిపత్రం అందజేశారు.
ఈ సందర్భంగా వెంకటేష్ మాదిగ మాట్లాడుతూ.. రాష్ట్రంలోని పాలిటెక్నిక్ కళాశాలలకు సంబంధించి ప్రభుత్వం తీసుకొచ్చిన జీవో 97పై పునరాలోచించి వెంటనే రద్దు చేయాలని కోరారు. అలాగే చేవెళ్ల కాంగ్రెస్ పార్టీ ప్రజాగర్జన సభలో దళిత, గిరిజన వర్గాలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు.
అంబేడ్కర్ అభయహస్తం పథకం కింద ప్రతి దళిత కుటుంబానికి రూ. 12 లక్షల ఆర్థిక సహాయం అందించాలని, రాజీవ్ యువ వికాసం కింద దరఖాస్తు చేసుకున్న లక్షలాది మంది నిరుద్యోగులను వెంటనే ఆదుకోవాలని కోరారు. కాంట్రాక్టుల్లో ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్లను సమర్థవంతంగా అమలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.
ఈ కార్యక్రమంలో గొల్ల కురుమ డోలు దెబ్బ రాష్ట్ర అధ్యక్షుడు మాల్గ యాదయ్య, ఎమ్మార్పీఎస్ ఉమ్మడి నల్గొండ జిల్లా అధ్యక్షుడు ముదిగొండ వెంకటేశ్వర్లు, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ నారపాక అంజి మాదిగ, బీసీ, ఎస్సీ, ఎస్టీ జేఏసీ జిల్లా అధ్యక్షుడు రాఘవేంద్ర యాదవ్, మునుగోడు నియోజకవర్గ ఎమ్మార్పీఎస్ ఇన్‌చార్జి పూదరి సైదులు, సాగర్ నియోజకవర్గ ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకుడు ఆదిమళ్ల సత్యనారాయణ, చనగళ్ల కోటేష్, యడవెల్లి శ్రీనివాస్, రేపాక శ్రీను తదితరులు పాల్గొన్నారు.

## అర్వపల్లి లో అవగాహన కల్పిస్తున్న సారధి కళాకారులు



**జాజిరెడ్డిగూడెం మండల (జనంసాక్షి):** విద్యార్థులు, యువకులు గంజాయి, డ్రగ్స్ మత్తు పదార్థాలను దూరంగా ఉండాలని తెలంగాణ సాంస్కృతిక సారధి జిల్లా టీం లీడర్ వెన్నెల నాగరాజు కోరారు. అర్వపల్లి లో శనివారం సారధి ఆధ్వర్యంలో పరిసరాల పరిశుభ్రత, ఆర్థడి పంటల సాగు, ఇందిరమ్మ వనమహోత్సవం తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో స్థానిక జడ్పీహెచ్ఎస్ హెచ్ఎం మల్లేష్, కళాకారుల శంకర్,సైదులు, లక్ష్మి,రాధ, మేడిపల్లి వేణు, శిరీష, రాధ పాల్గొన్నారు.



## మన గ్రోమోర్ ఎరువుల దుకాణం ప్రారంభం వినోద్ కుమార్

**మాడుగులపల్లి ఆగస్టు 22 (జనంసాక్షి):**
మండల కేంద్రంలో నూతనంగా ఏర్పాటు చేసిన మన గ్రోమోర్ ఎరువులు పురుగుమందుల దుకాణాన్ని జిల్లా వ్యవసాయ అధికారి వినోద్ కుమార్, జగదీశ్వర్ రెడ్డి స్థానిక ప్రజాప్రతినిధులు శనివారం ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా వ్యవసాయ అధికారి వినోద్ కుమార్ స్థానిక నాయకులు మాట్లాడుతూ, మండల పరిధిలోని రైతులకు నాణ్యమైన విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు సరసమైన ధరలకే అందుబాటులో ఉంచాలని నిర్వాహకులకు సూచించారు ప్రభుత్వం నిర్ణయించిన ధరలకే ఎరువులను విక్రయించాలని, నకిలీ ఎరువులు అమ్మినా లేదా కృత్రిమ కొరత సృష్టించినా కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు అంతే కాకుండా, ఈ కేంద్రం ద్వారా రైతులకు పంటల సాగు విధానంపై, సరైన మోతాదులో ఎరువుల వినియోగంపై తగిన సలహాలు అందించాలని కోరారు మండల కేంద్రంలోనే ఈ షాపు అందుబాటులోకి రావడం పట్ల స్థానిక రైతులు హర్షం వ్యక్తం చేశారు ?ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో స్థానిక ఎస్ ఐ సురేష్, స్థానిక సర్పంచ్ అరూరి నరేష్, ఉప సర్పంచ్ మల్లేపల్లి వెంకన్న, సిపిఎం పార్టీ రైతు సంఘం జిల్లా అధ్యక్షులు ముదిరెడ్డి సుధాకర్ రెడ్డి, మండల వ్యవసాయ అధికారి శివకుమార్, నాయకులు మన గ్రోమోర్ సిబ్బంది మురళి, కృష్ణంరాజు, జోనల్ హెడ్ రాజేష్,జోనల్ మార్కెటింగ్ మేనేజర్ శేషు, దర్శనం జానకయ్య,నల్గొండ ఏరియా మేనేజర్అశోక్,మాడుగుల పల్లి మన గ్రోమోర్ సెంటర్ మేనేజర్ నాగార్జున పరిసర గ్రామాల రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## భవిష్యత్తు ఎలక్ట్రిక్ వాహనాలదే

**సూర్యాపేట(జనంసాక్షి):**
భవిష్యత్తులో ఎలక్ట్రిక్ బైకుల వినియోగం మరింత పెరగనుందని ఎంజీ వన్ భూమి ఎలక్ట్రికల్ బైక్ కంపెనీ వ్యవస్థాపకులు రంగారెడ్డి మనోహర్‌రెడ్డి అన్నారు.శనివారం జిల్లా కేంద్రంలోని అమ్మ గార్డెన్ ఎదురుగా ఉన్న ఎంఎన్ఆర్ బ్యాంకెట్ హాల్ లో సీఅండ్ఎఫ్ సూర్యాపేట డీలర్ బూర మల్సూర్ గౌడ్ ఆధ్వర్యంలో నిర్వహించిన అవగాహన కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు.ప్రస్తుతం పెరుగుతున్న ఇంధన ధరలు,కాలుష్య సమస్యలకు ఎలక్ట్రిక్ వాహనాలు మంచి ప్రత్యామ్నాయంగా నిలుస్తాయని పేర్కొన్నారు.ఎలక్ట్రిక్ బైకుల వినియోగంతో ఇంధన ఖర్చులు తగ్గడంతో పాటు పర్యావరణానికి మేలు జరుగుతుందని అన్నారు. ప్రజలు ఎలక్ట్రిక్ వాహనాలపై అవగాహన పెంచుకుని భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా వాటిని వినియోగించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో వీరారెడ్డి, ప్రవీణ్ రెడ్డి, జనార్దన్, సతీష్ తదితరులు పాల్గొన్నారు.



## సూర్యాపేట ట్రాఫిక్ పోలీసుల స్పెషల్ డ్రైవ్

### నంబర్ ప్లేట్ లేని 50 బైక్ ల స్వాధీనం

**సూర్యాపేట(జనంసాక్షి):**
జిల్లా కేంద్రంలో సూర్యాపేట పట్టణ ట్రాఫిక్ పోలీసులు శనివారం ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు. నిబంధనలకు విరుద్ధంగా నంబర్ ప్లేట్లు లేకుండా తిరుగుతున్న 50 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకుని సీజ్ చేశారు.ఈ సందర్భంగా




వాహన యజమానులతో అప్పటికప్పుడే వాహనాలకు నంబర్ ప్లేట్లు వేయించి, నిబంధనలు పాటించేలా చర్యలు చేపట్టారు.అనంతరం పట్టుబడిన వాహనదారులకు ట్రాఫిక్ ఎస్ఐ యాదవేందర్ రెడ్డి కౌన్సిలింగ్ నిర్వహించారు.అనంతరం ఆయన మాట్లాడుతూ వాహనదారులు, పౌరులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని అన్నారు.వాహనానికి నంబర్ ప్లేట్ లేకపోతే ఏదైనా ప్రమాదం లేదా నేరం జరిగినప్పుడు వాహనాన్ని గుర్తించడం చాలా కష్టమవుతుందన్నారు.ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా ప్రభుత్వ నిబంధనల ప్రకారం నంబర్ ప్లేట్లను అమర్చుకోవాలని పేర్కొన్నారు. నిబంధనలు ఉల్లంఘిస్తే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## ఉత్తమ తహశీల్దార్‌గా అవార్డు పొందిన వీరబాయి

**చౌటుప్పల్ ఆగస్టు 21(జనం సాక్షి)**
మండల ప్రజలకు విశిష్టమైన సేవలు అందించినందుకు గాను, 80వ స్వాతంత్ర దినోత్సవం సందర్భంగా జిల్లా స్థాయిలో ఉత్తమ అధికారిగా పురస్కారం అందుకున్న తహశీల్దార్ వీరబాయిని స్థానిక నాయకులు ఘనంగా సన్మానించారు. మందోళ్ల గూడెం గ్రామ సర్పంచ్ తంగేళ్ళ వెంకటేష్ ఆధ్వర్యంలో తహశీల్దార్ కార్యాలయంలో శాలువాతో సత్కరించారు. ప్రజా సమస్యల పరిష్కారంలో, అత్యుత్తమ ప్రతిభ కనబరిచినందుకే ఆమెకు ఈ జిల్లా స్థాయి గుర్తింపు లభించిందని సర్పంచ్ కొనియాడారు. ఈ కార్యక్రమంలో 4వ వార్డు సభ్యులు కందగట్ల భవాని రామక్రిష్ణ, నాయకులు పగిల్ల అంజిరెడ్డి, యాట సత్తయ్య, కాటం నరేష్ తదితరులు పాల్గొన్నారు.



# నిషేధిత భూముల సమస్యకు సత్వర పరిష్కారం చూపాలి

## బీజేపీ పట్టణ అధ్యక్షులు కొండ హరీష్ గౌడ్

**హుజూర్‌నగర్, ఆగస్టు 22 (జనంసాక్షి) :**
22-ం నిషేధిత భూముల జాబితాలో ఉన్న భూములకు సంబంధించి రైతులు, వాస్తవ భూహక్కుదారులు, ప్లాట్లు కొనుగోలు చేసిన వారు, యజమానులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించి, బాధితులకు తగిన న్యాయం చేయాలని భారతీయ జనతా పార్టీ హుజూర్‌నగర్ పట్టణ శాఖ అధ్యక్షులు కొండ హరీష్ గౌడ్ అన్నారు. శనివారం ఆయన ఆధ్వర్యంలో పార్టీ నాయకులు, బాధితులతో కలిసి హుజూర్‌నగర్ ఆర్డీవో శ్రీనివాసులుని కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా బిజెపి పట్టణ అధ్యక్షులు కొండ హరీష్ గౌడ్ మాట్లాడుతూ 22-ం నిషేధిత భూముల కారణంగా రైతులు, భూహక్కుదారులు తమ భూములను విక్రయించుకోలేక, రిజిస్ట్రేషన్లు చేసుకోలేక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. అలాగే సామాన్య పేద, మధ్యతరగతి కుటుంబాల వారు తమ జీవితకాల సంపాదనతో ప్లాట్లు కొనుగోలు చేసి ఇళ్లు నిర్మించుకున్న వారు, యజమానులు సైతం రిజిస్ట్రేషన్, అమ్మకం, బ్యాంకు రుణాలు తదితర అంశాల్లో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. నిషేధిత జాబితాలో ఉన్న భూములపై సమగ్ర విచారణ నిర్వహించి, వాస్తవ హక్కుదారులను గుర్తించి, అర్హత ఉన్న భూములను 22-ం జాబితా నుంచి తొలగించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. అదేవిధంగా ప్రభుత్వ రికార్డులను పరిశీలించి, వాస్తవ పరిస్థితులను పరిగణనలోకి తీసుకుని బాధిత రైతులు, భూహక్కుదారులు, ఫ్లాట్ యజమానులకు తగిన న్యాయం జరిగేలా ప్రత్యేక చర్యలు చేపట్టాలని కోరారు. ఒకవేళ ఈ సమస్యను ప్రభుత్వం సానుకూలంగా పరిష్కరించకపోతే బాధితుల పక్షాన భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో ప్రజాస్వామ్య పద్ధతిలో పోరాటం చేస్తామని కొండ హరీష్ గౌడ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో బిజెపి పట్టణ అధ్యక్షులు కొండ హరీష్ గౌడ్ తో పాటు బిజెపి లీగల్ సెల్ నాయకులు పిడమర్తి చంద్రయ్య, పట్టణ ప్రధాన కార్యదర్శి రాళ్ళబండి రామారావు, ఓబీసీ మోర్చా జిల్లా కార్యదర్శి కంటు నాగరాజు, పట్టణ ఉపాధ్యక్షుడు పైడిమర్రి విజయ్, జిల్లా నాయకులు మేళ్ళచెరువు లక్ష్మణ్, యువ మోర్చా అధ్యక్షుడు సతి బలవంత్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.



# ప్రమాణానికి రమ్మంటే ముఖం చాటేశారు

- కూసుకుంట్ల ఆరోపణలు నిరాధారమన్న చైర్మన్ కోడి శ్రీనివాసులు
- ఆంజనేయస్వామి ఆలయంలో గంటల తరబడి ఎదురుచూపులు..
- రాని మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ శ్రేణులు..



**చండూరు, ఆగస్టు 22 (జనంసాక్షి)**
చండూరు మున్సిపాలిటీలో అవినీతి ఆరోపణలు రాజకీయంగా తీవ్ర దుమారం రేపుతున్నాయి. బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి చేసిన ఆరోపణలకు కాంగ్రెస్ మున్సిపల్ చైర్మన్ కోడి శ్రీనివాసులు సవాల్ విసరగా.. ఆ సవాల్ శనివారం రోజు ప్రమాణాల పోరుగా మారింది. ఈ నెల 17న చండూరు చౌరస్తాలో నిర్వహించిన ధర్నాలో ప్రభాకర్‌రెడ్డి మున్సిపల్ పాలకవర్గంపై తీవ్ర అవినీతి ఆరోపణలు చేశారు. పండ్ల వ్యాపారుల వద్ద బస్‌షెల్టర్ల పేరుతో రూ.12 లక్షలు లంచంగా తీసుకున్నారని, వైన్‌షాపులు, రియల్ ఎస్టేట్ వ్యాపారులు, ఆసుపత్రుల నుంచి డబ్బులు వసూలు చేస్తున్నారని ఆరోపించారు. దేవుడి సన్నిధిలో ప్రమాణం చేసేందుకు తాను సిద్ధమని కూడా సవాల్ చేశారు. ఈ ఆరోపణలను ఖండించిన చైర్మన్ కోడి శ్రీనివాసులు.. ఆరోపణలు నిరూపించేందుకు చండూరు ఆంజనేయస్వామి ఆలయం వద్ద ప్రమాణానికి రావాలని ప్రతిసవాల్ చేశారు. ఇచ్చిన గడువు మేరకు శనివారం ఉదయం 9 గంటలకు మున్సిపల్ పాలకవర్గ సభ్యులు, కాంగ్రెస్ నాయకులు, స్థానిక వ్యాపారులు ఆలయానికి చేరుకుని ప్రభాకర్‌రెడ్డి రాక కోసం గంటల తరబడి నిరీక్షించారు. అయితే మాజీ ఎమ్మెల్యే గానీ, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు గానీ ఆలయానికి రాలేదు. దీంతో కాంగ్రెస్ నాయకులు తీవ్ర స్థాయిలో స్పందించారు. ఒక్క రూపాయి లంచం తీసుకున్నట్లు కూడా నిరూపించలేకపోయారని, ఆధారాలు లేకుండా ఆరోపణలు చేసిన ప్రభాకర్‌రెడ్డి ప్రజలకు బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. భవిష్యత్తులో నిరాధార ఆరోపణలు చేస్తే సహించేది లేదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ కోడి శ్రీనివాసులు, వైస్ చైర్మన్ భూతరాజు దశరథ, పట్టణ అధ్యక్షుడు ఐత రాజు మల్లేష్, కోడి వెంకన్న, రమేష్, బుసిపాక వాసు, కలిమికొండ జనార్ధన్, షరీఫ్ ఖలీల్, సైదులు తదితర కాంగ్రెస్ నాయకులు, స్థానిక వ్యాపారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# 33 దేవాలయాల అమ్మవార్లకు భక్తిశ్రద్ధలతో ఒడిబియ్యం

**కొండమల్లేపల్లి, ఆగస్టు 22 (జనంసాక్షి):**
33 దేవాలయాల అమ్మవార్లకు ఒడిబియ్యం సమర్పించడం అనేది ఒక విశేషమైన భక్తి ఆచారం. అమ్మవారి అనుగ్రహం కోసం మొక్కుల చెల్లింపునకు విశేష వ్రతాలలో 33 విభిన్న శక్తిపీఠాల అమ్మవారి ఆలయాలలో ముత్తైదువుల ద్వారా స్వయంగా అమ్మవారి మూలవిరాట్టుకు అర్చనలో ఒడిబియ్యం పోసి పూజలు చేస్తారు. అందులో భాగంగా కొండమల్లేపల్లి పట్టణ కేంద్రంలో కొలువైన ముత్యాలమ్మ దేవాలయంలో దేవి గ్రూప్ నిర్వాహకురాలు గుమ్మడవల్లి గీత, గ్రూప్ సభ్యులు, గ్రామ వార్డు సభ్యులు ముచ్చర్ల మాధవి కరుణాకర్ చేతుల మీదుగా అమ్మవారికి ఒడి బియ్యం కార్యక్రమం భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. అనంతరం దేవి గ్రూప్ సభ్యులు మాట్లాడుతూ దేవి ఒడిబియ్యం గ్రూపు నుండి గ్రామదేవత అయినా ముత్యాలమ్మ వారికి ఒడిబియ్యం పోయడం జరిగిందన్నారు. ఈ గ్రూప్ ప్రత్యేకత 33 కోట్ల దేవతల సాక్షిగా 33 మహిళలచే 33 దేవాలయాల అమ్మవార్లకు ఒడిబియ్యం పోయాలని నిర్ణయించుకున్నామన్నారు. ఇందుకుగాను ప్రతినెల ఒక పేరు డ్రా తీసి ఎంపిక చేసుకొని వారిచే ఒక దేవాలయంలో ఒడిబియ్యం పోయడం జరుగుతుందన్నారు. ఇప్పటికీ 21వ దేవాలయం అయినా ముత్యాలమ్మ అమ్మవారికి భక్తి శ్రద్ధలతో ఒడి బియ్యం కార్యక్రమం నిర్వహించామన్నారు..

# కొనసాగుతున్న పవిత్రోత్సవాలు

**సూర్యాపేట(జనంసాక్షి):**
జిల్లా కేంద్రంలోని ప్రసిద్ధ వేంకటేశ్వర స్వామి వారి దేవస్థానంలో పవిత్రోత్సవములలో భాగంగా రెండవ రోజు శనివారం యాగశాలలో హోమ కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు నల్లాన్ చక్రవర్తుల వేణుగోపాలాచార్యులు ఆధ్వర్యంలో యజ్ఞచార్యులు హరిచరణ్ ఆచార్యులు, అనిల్ కుమార్ స్వామివారికి పట్టు పవిత్ర మాలలు అలంకరించి ఆరాధనలు కొనసాగించారు. మధ్యాహ్నం నిత్య పూర్ణాహుతి నిర్వహించారు. ఈ కార్యక్రమం లో కార్యనిర్వహణాధికారి, అభివృద్ధి కమిటీ సభ్యులు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. సాయంత్రం శ్రీవిష్ణు సహస్రనామ స్తోత్ర పారాయణం యాగశాలలో హోమ కార్యక్రమాలు, నిత్య పూజా కార్యక్రమాలు నిర్వహించారు.

## రెండవ రోజు హర్ష టయోటా

# గ్రామీణ మహోత్సవం

## మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి

## బ్రాంచ్ సేల్స్ ఆఫీసర్ మనీష్



**ఆత్మకూర్ (ఎం) జనంసాక్షి ఆగస్టు (22)**
మండల కేంద్రంలో హర్ష టయోటా ఆధ్వర్యంలో గ్రామీణ మహోత్సవం కార్యక్రమం రెండువ రోజు నిర్వహించారు. ఇండియన్ ఆయిల్ పెట్రోల్ బంక్ ఎదురుగా ఏర్పాటు చేశారు. ఈ సందర్భం గా హర్ష టయోటా భువనగిరి బ్రాంచ్ సేల్స్ ఆఫీసర్ మనీష్ మాట్లాడుతు కొత్త కార్ల కొనుగోలు, ఎక్స్ఛేంజ్ వాల్యుయేషన్, యూజ్డ్ కార్లు, ఫైనాన్స్ సదుపాయాలు వంటి ప్రత్యేక సేవలు అందుబాటులో ఉంటాయి. ఈ గ్రామీణ మహోత్సవం ఆదివారం రోజు కూడా జరుగుతుంది అని తెలిపారు. కావున ఈ అవకాశాన్ని పాటు మండల కేంద్రంలో కొనసాగనుంది. కావున మండలం లో ని అన్ని గ్రామాల ప్రజలందరూ ఈ సదవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమం లో మార్కెటింగ్ ఆఫీసర్ సాయిలు, బన్నీ తదితరులు వున్నారు.

# వరి సాగుకు దూరంగా ఉండాలి..

## ప్రత్యామ్నాయ పంటలపై దృష్టి సారించాలి

**చింతపల్లి, ఆగస్టు 22 (జనంసాక్షి)**
ఎల్‌నినో ప్రభావం, భూగర్భ జలాల తగ్గుదల, రానున్న రోజుల్లో విద్యుత్ కోతలను దృష్టిలో ఉంచుకుని రైతులు తక్కువ నీటితో సాగు చేసే ఆరుతడి పంటల వైపు మొగ్గు చూపాలని వ్యవసాయ విస్తరణ అధికారి ఏ. నరసింహ సూచించారు. కుర్మేడ్ క్లస్టర్ పరిధిలోని మోదుగుల మల్లేపల్లి గ్రామంలో సర్పంచ్ ముద్ధం మల్లేష్ గౌడ్ ఆధ్వర్యంలో రైతులకు ప్రత్యామ్నాయ పంటల సాగుపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఇకపై వరి నాట్లు వేయకుండా నీటి లభ్యతకు అనుగుణంగా ఆరుతడి పంటలను సాగు చేయాలని నరసింహ సూచించారు. భూగర్భ జలాలు తగ్గుతున్న నేపథ్యంలో తక్కువ నీరు, తక్కువ విద్యుత్‌తో సాగు చేసే పంటలకు ప్రాధాన్యం ఇవ్వాలని తెలిపారు. కార్యక్రమంలో వార్డు సభ్యులు, గ్రామ పెద్దలు, రైతులు పాల్గొన్నారు...



# డాక్టర్ రాములు నాయక్ జ్ఞాపకార్థం ఘనంగా రక్తదాన శిబిరం

## సేవాభావంతో రక్తదానం చేసిన యువత..

## పలువురి ప్రాణాలకు అండగా నిలిచిన రక్తదాతలు

**చింతపల్లి, ఆగస్టు 22 (జనం సాక్షి)**
దివంగత డాక్టర్ రాములు నాయక్ జ్ఞాపకార్థం శనివారం చింతపల్లి పట్టణంలోని మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్‌లో నిర్వహించిన రక్తదాన శిబిరం ఘనంగా జరిగింది. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు కొనసాగిన ఈ శిబిరానికి యువత, స్థానికులు, అభిమానులు పెద్ద సంఖ్యలో హాజరై స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. డాక్టర్ రాములు నాయక్ పేద ప్రజలకు అందించిన వైద్య సేవలను స్మరించుకుంటూ, ఆయన సేవా స్ఫూర్తిని కొనసాగించాలనే ఉద్దేశంతో ఈ రక్తదాన శిబిరాన్ని నిర్వహించినట్లు డాక్టర్ ఆంజనేయులు, ప్రవళిక రాథోడ్ తెలిపారు. రక్తదానం చేయడం ద్వారా అత్యవసర పరిస్థితుల్లో ఉన్న వారికి ప్రాణదానం చేసినట్లేనని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ రవి ప్రకాష్, మిర్యాలగూడ ఆర్ఎంఓ భాను ప్రసాద్ మాట్లాడుతూ ఆరోగ్యవంతులైన ప్రతి ఒక్కరూ స్వచ్ఛందంగా రక్తదానం చేసేందుకు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. రక్తదాతలు అందించిన రక్తం ప్రమాదాలు, అత్యవసర వైద్య చికిత్సలు, శస్త్రచికిత్సల సమయంలో ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు. శిబిరంలో రక్తదానం చేసిన దాతలకు నిర్వాహకులు కృతజ్ఞతలు తెలిపారు. డాక్టర్ రాములు నాయక్ ప్రజలకు చేసిన సేవలను స్ఫూర్తిగా తీసుకుని భవిష్యత్తులోనూ సామాజిక సేవా కార్యక్రమాలను కొనసాగిస్తామని పేర్కొన్నారు. పేద ప్రజలకు డాక్టర్ రాములు నాయక్ అందించిన సేవలు చిరస్మరణీయమని పలువురు కొనియాడారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ జయప్రకాష్, రక్తదానం చేసిన యువకులు, ఆసుపత్రి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## మితిమీరిన వేగంతో ఆర్టీసీ అద్దె బస్సులు.. ప్రయాణికుల ప్రాణాలకు ముప్పు..

టార్గెట్ల కారణంగా డ్రైవర్లు వేగంగా బస్సులు నడుపుతున్నారని ప్రయాణికులు ఆరోపిస్తున్నారు. ఇటీవల బస్సులు వేగంగా దూసు కెళ్లడంతో ఎదురుగా వచ్చే స్కూల్ బస్సులు, ఆటోలు, ద్విచక్ర వాహనాలు, ఇతర వాహనదారులు ప్రమాదాల బారిన పడే పరిస్థితులు ఏర్పడుతున్నాయని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతంలో మితిమీరిన వేగంతో వచ్చిన బస్సును తప్పించుకునే క్రమంలో ఆటో అదుపుతప్పి చెట్టును ఢీకొనడంతో ఓ వృద్ధుడు మృతి చెందిన ఘటనను ప్రజలు గుర్తుచేస్తున్నారు.ఇక ఇప్పటికే రహదారులు గుంతలమయంగా, అధ్వానంగా ఉండటంతో వేగంగా బస్సులు నడపడం మరింత ప్రమాదకరంగా మారిందని వాహనదారులు చెబుతున్నారు. చిన్నారులు, మహిళలు, వృద్ధులు ప్రయాణించే ఆటోలు, ద్విచక్ర వాహనాల పట్ల ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఉందని పేర్కొంటున్నారు. మణుగూరు?భద్రాచలం మార్గంతో పాటు ఇతర రూట్లలో నడుస్తున్న అద్దె బస్సుల వేగాన్ని నియంత్రించడంతో పాటు డ్రైవర్లకు క్రమశిక్షణపై స్పష్టమైన ఆదేశాలు ఇవ్వాలని ప్రయాణికులు డిమాండ్ చేస్తున్నారు. బస్సుల ఫిట్‌నెస్, ఓవర్‌లోడ్, డ్రైవర్ల పనితీరును అధికారులు నిరంతరం తనిఖీ చేయాలని కోరుతున్నారు.ప్రజల ప్రాణాల కంటే ఆదాయం, ట్రిప్పులే ముఖ్యమనే ధోరణి వీడాలి. ఆర్టీసీ యాజమాన్యం, జిల్లా అధికారులు, రవాణా శాఖ వెంటనే స్పందించి అద్దె బస్సులపై నియంత్రణ చర్యలు చేపట్టాలని, రహదారులను కూడా మెరుగుపరచాలని స్థానికులు కోరుతున్నారు. మరిన్ని ప్రమాదాలు జరగకముందే ముందస్తు చర్యలు తీసుకోవాలని గట్టిగా డిమాండ్ చేస్తున్నారు.

## భారత్ నేషనల్ యూత్ వాలంటీర్‌గా వడ్లకొండ వేణు నియామకం



**అడ్డగూడూర్/ఆగస్టు 22(జనంసాక్షి )**
యాదాద్రి భువనగిరి జిల్లా అడ్డగూడూరు మండలం గట్టు సింగారం గ్రామానికి చెందిన వడ్లకొండ వేణు 'మై భారత్' భువనగిరి జిల్లా బ్లాక్ లెవల్ నేషనల్ యూత్ వాలంటీర్ గా నియమితులయ్యారు. కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో ఆయనకు ఈ అవకాశం లభించింది.యువతను దేశ నిర్మాణంలో భాగస్వామ్యం చేయడం, సామాజిక సేవా కార్యక్రమాల్లో యువతను ప్రోత్సహించడం, వివిధ అవగాహన కార్యక్రమాలను నిర్వహించడం వంటి కార్యక్రమాల్లో వేణు సేవలందించనున్నారు.ఈ సందర్భంగా గట్టు సింగారం గ్రామస్తులు, యువత ఆయనకు అభినందనలు తెలియజేస్తూ, మరిన్ని సేవా కార్యక్రమాల్లో విజయవంతంగా ముందుకు సాగాలని ఆకాంక్షించారు.

## దేవరకొండ నియోజకవర్గంలో ఎస్ఐఆర్ కు ముందు 2,69,098 ఓట్లు

- ఆగస్టు 17న ప్రచురించిన డ్రాఫ్ట్ ఓటరు జాబితాలో 2,32,283 మంది ఓటర్లు
- దేవరకొండ నియోజకవర్గంలో వివిధ కారణాలతో తొలగించిన ఓట్లు 36,815
- ఎన్నికల సంఘం నిర్దేశించిన 12 డాక్యుమెంట్లు అందుబాటులో ఉండాలి
- దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్





**కొండమల్లేపల్లి, ఆగస్టు 22 (జనంసాక్షి):** ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ 2026 రెండో విడత ప్రక్రియపై దేవరకొండ పట్టణంలోని వైష్ణవి ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన శిక్షణ శిబిరంలో దేవరకొండ నేనావత్ బాలు నాయక్ పాల్గొని బూత్ లెవెల్ ఏజెంట్లు కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బాలు నాయక్ మాట్లాడుతూ ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఎస్ఐఆర్ ప్రక్రియలో భాగంగా రెవెన్యూ అధికారులు, బూత్ స్థాయి అధికారులు ప్రతి ఓటరుకు ఎన్యూమరేషన్ ఫారాలను అందించారని తెలిపారు. ఎస్ఐఆర్ కు ముందు దేవరకొండ అసెంబ్లీ నియోజకవర్గంలో 2,69,098 మంది ఓటర్లు ఉండగా ఆగస్టు 17న ప్రచురించిన డ్రాఫ్ట్ ఓటరు జాబితాలో 2,32,283 మంది ఓటర్లు ఉన్నారని చెప్పారు. మొత్తం 36,815 మంది ఓటర్లను వివిధ కారణాలతో తొలగించినట్లు తెలిపారు. తొలగించిన ఓటర్లలో 7,451 మంది మరణించినవారు, 7,629 మంది డూప్లికేట్ ఓటర్లు, 395 మంది ఆయా చిరునామాల్లో లేనివారు ఉన్నారని మరో 21,313 మంది ఓటర్లు ఇతర ప్రాంతాలకు తరలివెళ్లినట్లు గుర్తించినట్లు ఎమ్మెల్యే వివరించారు. ఇప్పటికే తాజా ఓటరు జాబితాలను రెవెన్యూ అధికారులు బిఎల్ఓ లకు రెండు సెట్లుగా అందించారని అందులో ఒక సెట్ బిఎల్ఓ వద్ద మరో సెట్ ప్రజల పరిశీలన కోసం గ్రామాల్లో అందుబాటులో ఉంచారని తెలిపారు. ప్రజలు తమ పేర్లు వివరాలను పరిశీలించుకుని ఏవైనా అభ్యంతరాలు లేదా మార్పులు ఉంటే సంబంధిత అధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. ప్రస్తుత ఓటరు జాబితాలో 51,427 మంది ఓటర్లకు నోటీసులు జారీ చేయనున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. ఇందులో 4,784 మంది నో మ్యాపింగ్ 46,643 మంది లాజికల్ ఎర్రర్స్ కింద ఉన్నారని పేర్కొన్నారు. వీరికి సంబంధించి ఆగస్టు 27, 2026 నుంచి సెప్టెంబర్ 27, 2026 వరకు ఆయా గ్రామాల్లోనే గ్రామపంచాయతీ కార్యాలయాల వద్ద రెవెన్యూ అధికారులు విచారణ నిర్వహిస్తారని చెప్పారు. నోటీసులు అందడంలో ఏదైనా ఇబ్బంది ఏర్పడినా విచారణకు సంబంధించిన సమాచారం ఉన్న ప్రతి ఓటరు నిర్ణీత తేదీన తప్పనిసరిగా హాజరై తమ వద్ద ఉన్న ఆధారాలను సమర్పించాలని ఎమ్మెల్యే సూచించారు. ఎన్నికల సంఘం నిర్దేశించిన 12 రకాల డాక్యుమెంట్లలో అందుబాటులో ఉన్న ఆధారాలను బిఎల్ఓలకు, తహసీల్దార్లకు సమర్పించి తమ ఓటు హక్కును కాపాడుకోవాలని కోరారు. 18 సంవత్సరాలు నిండినప్పటికీ ఓటరు జాబితాలో పేరు లేని వారు కొత్తగా ఓటరుగా నమోదు చేసుకునేందుకు మీసేవ ద్వారా ఫారం-6లో దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. ఇందుకు సెప్టెంబర్ 16, 2026 వరకు అవకాశం ఉందని వచ్చిన క్లెయిమ్‌లు, అభ్యంతరాలను పరిశీలించి తుది ఓటరు జాబితాలో అర్హులైన వారిని నమోదు చేస్తారని చెప్పారు. తుది ఓటరు జాబితా అక్టోబర్ 19, 2026న ప్రచురించనున్నట్లు తెలిపారు. 2002 ఓటరు జాబితాతో ప్రస్తుతం ఉన్న 2025 ఓటరు జాబితాలో తేడాలు ఉన్న సందర్భాల్లోనే సంబంధిత ఓటర్లకు నోటీసులు జారీ చేస్తున్నట్లు ఎమ్మెల్యే స్పష్టం చేశారు. ఈ ప్రక్రియలో ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని అర్హత ఉన్న ప్రతి ఒక్కరి ఓటు హక్కును పరిరక్షించేందుకు అధికారులు, పార్టీ బూత్ స్థాయి ప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నల్గొండ జిల్లా అధ్యక్షుడు పున్న కైలాష్ నేత, ఎస్ఐఆర్ పార్లమెంట్ కోఆర్డినేటర్ శ్రీనివాసరావు, ఉపాధ్యక్షుడు ముక్కమల్ల వెంకటయ్య గౌడ్, మున్సిపల్ చైర్మన్ పున్న శైలజ వెంకటేశ్వర్లు, జిల్లా ప్రధాన కార్యదర్శులు ఉట్కూరి వేమన్ రెడ్డి, మేకల రాజేందర్ రెడ్డి, హన్మంతు వెంకటేష్ గౌడ్, కొర్ర రాంసింగ్, కాసర్ల వెంకటేశ్వర్లు, జిల్లా కార్యదర్శులు, దేవరకొండ నియోజకవర్గం అన్ని మండలాధ్యక్షులు, కౌన్సిలర్లు, సర్పంచులు, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, యువజన కాంగ్రెస్ నాయకులు, బీఎల్ఏలు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## బర్త్‌డే వేడుకలే రాజకీయ ప్రకంపనలు!

- వేలాదిగా తరలివచ్చిన ప్రజలు..
- ప్రధాన పార్టీల్లో మొదలైన చర్చ
- సేవా కార్యక్రమాలతో ప్రజల కష్టసుఖాల్లో ఈఎల్‌వీ భాస్కర్..
- మునుగోడులో కొత్త రాజకీయ సమీకరణాలపై ఆసక్తి



**మర్రిగూడ, ఆగస్టు 22 (జనంసాక్షి)** మునుగోడు నియోజకవర్గ రాజకీయాల్లో ఈఎల్‌వీ భాస్కర్ పేరు ఇప్పుడు హాట్‌టాపిక్ గా మారింది. నల్లగొండ జిల్లా మునుగోడు నియోజకవర్గం గట్టుప్పల్ మండలం తెరటపల్లి గ్రామానికి చెందిన ఇరగదింట్ల భాస్కర్ జన్మదిన వేడుకలకు పెద్ద సంఖ్యలో ప్రజలు స్వచ్ఛందంగా తరలిరావడం రాజకీయ వర్గాల్లో చర్చకు దారితీసింది. సాధారణంగా జన్మదిన వేడుకలుగా జరిగే కార్యక్రమం..ఈఎల్‌వీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో కొనసాగుతున్న సేవా కార్యక్రమాలు నియోజకవర్గంలోని వివిధ మండలాలు, గ్రామాలకు విస్తరిస్తుండటంతో భాస్కర్‌కు ప్రజల్లో పరిచయం, ఆదరణ పెరుగుతోందన్న చర్చ సాగుతోంది. పేదలకు అండగా నిలవడం, విద్యార్థులకు విద్యా సహాయం అందించడం, సామాజిక సేవా కార్యక్రమాలు చేపట్టడం వంటి కార్యక్రమాల ద్వారా ఆయన ప్రజలకు చేరువవుతున్నారని అనుచరులు చెబుతున్నారు.

**రాజకీయ పార్టీల్లోనూ చర్చ**

భాస్కర్ రాజకీయాల్లోకి వస్తారా? ఏదైనా ప్రధాన పార్టీ తరపున బరిలోకి దిగుతారా? లేక స్వతంత్రంగా పోటీ చేస్తారా? అనే అంశాలపై మునుగోడు రాజకీయ వర్గాల్లో చర్చ మొదలైంది. ముఖ్యంగా బీసీ సామాజిక వర్గానికి చెందిన స్థానికుడిగా భాస్కర్‌కు లభిస్తున్న ఆదరణ భవిష్యత్ రాజకీయ సమీకరణాలపై ప్రభావం చూపే అవకాశం ఉందనే అభిప్రాయాలు వినిపిస్తున్నాయి. అయితే భాస్కర్ ప్రస్తుతం ప్రత్యక్ష రాజకీయ ప్రవేశం పై స్పష్టమైన ప్రకటన చేయక పోయినా.. ఆయన సేవా కార్యక్రమాల విస్తరణ, ప్రజలతో పెరుగుతున్న అను బంధం మాత్రం రాజకీయ పరిశీలకుల దృష్టి ని ఆకర్షిస్తోంది. రానున్న రోజుల్లో ఆయన రాజకీయ రంగ ప్రవేశం చేస్తే మునుగోడు రాజకీయాల్లో కొత్త పోటీకి తెరలేచే అవకాశం ఉందన్న చర్చ కూడా సాగుతోంది.

**బర్త్‌డే వేడుకలపై ప్రత్యేక ఆసక్తి**

భాస్కర్ జన్మదిన వేడుకలకు వివిధ వర్గాలకు చెందిన ప్రజలు, నాయకులు, అభిమానులు హాజరుకావడం రాజకీయంగా ఆసక్తిని రేకెత్తించింది. ఒక వ్యక్తి జన్మదిన వేడుకలకు ఇంతటి స్పందన రావడం ఆయనకు పెరుగుతున్న ప్రజా పరిచయానికి సంకేతమని అనుచరులు అభివర్ణిస్తున్నారు. ప్రధాన రాజకీయ పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు కూడా భాస్కర్ కార్యకలాపాలను నిశితంగా గమనిస్తున్నారన్న చర్చ స్థానికంగా వినిపిస్తోంది. అయితే పార్టీలు అధికారికంగా ఎలాంటి ఆదేశాలు జారీ చేశాయన్న అంశానికి ధృవీకరణ అవసరం ఉండటంతో, దీనిపై స్పష్టత రావాల్సి ఉంది.

**'పోటీ చేస్తే గెలుస్తారా?'.. ప్రజల్లో చర్చ**

మునుగోడులో భాస్కర్‌కు పెరుగుతున్న ఆదరణ ను దృష్టిలో ఉంచుకుని ఆయన ఎన్నికల బరిలోకి దిగితే ఫలితం ఎలా ఉంటుందన్న చర్చ గ్రామస్థాయిలో మొదలైంది. ముఖ్యంగా యువత, విద్యార్థులు, పేద కుటుంబాలకు ఆయన అందిస్తున్న సహాయ కార్యక్రమాలు రాజకీయంగా ఎంతవరకు ప్రభావం చూపుతాయన్నది ఆసక్తికరంగా మారింది.ప్రస్తుతం మునుగోడులో భాస్కర్‌కు ఉన్న ప్రజాదరణను ఎన్నికల విజయంగా ముందుగానే అంచనా వేయడం కంటే.. ఆయన సేవా కార్యక్రమాలు భవిష్యత్‌లో రాజకీయ శక్తిగా మారుతాయా? అన్నదే అసలు ప్రశ్నగా మారింది.మొత్తంగా చూస్తే.. ఈఎల్‌వీ భాస్కర్ జన్మదిన వేడుకలు కేవలం ఒక వేడుకగా కాకుండా మునుగోడు రాజకీయాల్లో చర్చకు వేదికగా మారాయి. సేవా కార్యక్రమాలతో ప్రజలకు మరింత చేరువవుతున్న భాస్కర్ భవిష్యత్ అడుగులు ఎలా ఉండబోతున్నాయన్నది ఇప్పుడు మునుగోడు రాజకీయ వర్గాల్లో ఆసక్తికర అంశంగా మారింది.

## సురవరం సుధాకర్ రెడ్డి ఆశయాల సాధనకు కృషి చేయాలి

### సిపిఐ మండల కార్యదర్శి ఊట్కూరి నరసింహ



**రామన్నపేట, ఆగస్టు 22 (జనంసాక్షి):** సిపిఐ మాజీ జాతీయ ప్రధాన కార్యదర్శి, మాజీ నల్గొండ పార్లమెంటు సభ్యుడు సురవరం సుధాకర్ రెడ్డి ఆశయాలను కొనసాగిస్తూ ప్రజా సమస్యల పరిష్కారం కోసం ప్రతి ఒక్కరు కృషి చేయాలని సిపిఐ మండల కార్యదర్శి ఊట్కూరి నరసింహ పిలుపునిచ్చారు. శనివారం మండల కేంద్రంలోని సుభాష్ సెంటర్లో కామ్రేడ్ సురవరం సుధాకర్ రెడ్డి ప్రథమ వర్ధంతిని సిపిఐ ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా జోహార్లు అర్పించారు. ఈ సందర్భంగాసిపిఐ మండల కార్యదర్శి ఆయన మాట్లాడుతూ.. ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లాలో జన్మించిన సురవరం సుధాకర్ రెడ్డి నల్లగొండ జిల్లాకు విడదీయరాని అనుబంధం ఉంది అని అన్నారు. నల్లగొండ గడ్డపై వామపక్ష ఉద్యమాలకు నాయకత్వం వహించి ప్రజా సమస్యల పరిష్కారం కోసం కృషి చేశారని తెలిపారు. నల్లగొండ లోక్ సభ స్థానం నుండి పార్లమెంటు సభ్యునిగా రెండుసార్లు ఎన్నికై ప్రజలకు విశిష్ట సేవలు అందించారని పేర్కొన్నారు. ముఖ్యంగా సాగు నీరు ప్రాజెక్టులను ఎస్ ఎల్ బి సి శ్రీశైలం ఎడమ గట్టు కాలువ డిండి ఎత్తిపోతల పథకం తదితర అంశాలపై ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చారు. రైతులకు ప్రజల ప్రయోజనాల కోసం అలుపెరుగని పోరాటం కొనసాగించాడని కొనియాడారు.సిపిఐ జాతీయ కార్యదర్శిగా పనిచేసిన సురవరం సుధాకర్ రెడ్డి ఎప్పుడు ప్రజల మధ్యనే ఉంటూ ప్రజల పక్షాన నిలిచిన ఉద్యమ నాయకుడు అని ఆయన ఆశయాలను కొనసాగిస్తూ ప్రజా ఉద్యమాలను మరింత బలోపేతం చేయడమే నిజమైన నివాళులు అని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పట్టణ కార్యదర్శి రచ్చయాదగిరి, ఏఐటీయూసీ మండల కార్యదర్శి శివరాత్రి సమ్మయ్య, సీనియర్ కామ్రేడ్స్ బాలగోని మల్లయ్య, ఊట్కూరి భగవంతం, వీరమల్ల వెంకటయ్య, గంగాపురం యాదయ్య, గంగాపురం వెంకటయ్య,పర్స సుదర్శన్, కళ్లం యాదయ్య,ఊట్కూరి కృష్ణ ,వీసం గాలయ్య, పల్లె మల్లేశం, సిహెచ్ మల్లేశం, రచ్చ దయాకర్, గంజి అశోక్ తదితరులు పాల్గొన్నారు.

# జర్నలిస్టుల పాదయాత్ర చరిత్రాత్మకం




- ఇండ్ల స్థలాల కోసం రోడ్డెక్కిన కలం సైన్యం..
- షోయాబుల్లాఖాన్ స్ఫూర్తితో సుబ్లేడు నుంచి పోరాట పయనం..
- ఇండ్ల స్థలాలు సాధించేవరకూ పోరాటం..
- తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఖదీర్, శ్రీనివాసరెడ్డి..

**ఖమ్మం రూరల్, ఆగస్టు 22 (జనంసాక్షి)**
ప్రజల సమస్యలను తమ సమస్యలుగా భావించి నిత్యం అక్షరాలతో పోరాడే జర్నలిస్టులు.. తమ న్యాయమైన హక్కుల కోసం తొలిసారి రోడ్డెక్కారు. ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు జర్నలిస్టులకు ఇండ్ల స్థలాలు కేటాయించాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ (హెచ్-2843) ఖమ్మం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో చేపట్టిన పాదయాత్రకు అడుగడుగునా ప్రజల నుంచి అపూర్వ స్పందన లభించింది. జర్నలిస్టుల హక్కుల కోసం సాగుతున్న ఈ పాదయాత్ర చరిత్రలో నిలిచిపోయే ఉద్యమంగా మారుతుందని టీడబ్ల్యూజేఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సయ్యద్ ఖదీర్, కొత్తపల్లి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు.

**షోయాబుల్లాఖాన్ అడుగుజాడల్లో.. జర్నలిస్టుల హక్కుల బాటలో**
నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా తన కలంతో పోరాడి, రజాకారుల చేతుల్లో పాశవికంగా హతమైన తొలితరం జర్నలిస్టు షోయాబుల్లాఖాన్ జన్మస్థలమైన సుబ్లేడు గ్రామం నుంచి ఈ చారిత్రాత్మక పాదయాత్రకు శ్రీకారం చుట్టారు. శనివారం ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించిన అనంతరం జర్నలిస్టులు పాదయాత్రను ప్రారంభించారు. ప్రజల గొంతుకగా నిలిచిన షోయాబుల్లాఖాన్ స్ఫూర్తితో.. నేటి జర్నలిస్టుల హక్కుల కోసం సాగుతున్న ఈ పోరాటం అక్షరానికి ఉన్న శక్తిని మరోసారి చాటిచెబుతోందని నాయకులు పేర్కొన్నారు.

**అడుగడుగునా ప్రజల హారతులు:రాజకీయ, ప్రజా సంఘాల సంఘీభావం**
జర్నలిస్టుల పాదయాత్రకు అన్ని రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాలు, ప్రజలు సంపూర్ణ సంఘీభావం ప్రకటించారు. కోలాటాలు, డప్పు వాయిద్యాలతో కళాకారులు పాదయాత్రకు ఘన స్వాగతం పలికారు. పలుచోట్ల మహిళలు హారతులు ఇచ్చి అడుగడుగునా జర్నలిస్టులకు బ్రహ్మరథం పట్టారు. ఘనంగా స్వాగతించారు. ప్రజల సమస్యల కోసం నిరంతరం పనిచేసే జర్నలిస్టులు తమ సమస్యల కోసం రోడ్డెక్కడం బాధాకరమని, వారి న్యాయమైన పోరాటానికి అండగా నిలుస్తామని వివిధ రాజకీయ పార్టీల, ప్రజా సంఘాల నాయకులు స్పష్టం చేశారు.

**తెలుగు రాష్ట్రాల చరిత్రలోనే ప్రత్యేక అధ్యాయం.**
జర్నలిస్టుల హక్కుల సాధన కోసం చేపట్టిన ఈ పాదయాత్ర తెలుగు రాష్ట్రాల చరిత్రలోనే ఒక ప్రత్యేక అధ్యాయంగా నిలుస్తుందని టీడబ్ల్యూజేఎఫ్ నాయకులు పేర్కొన్నారు. భారతదేశంలో ఒడిశాలో తొలిసారి జర్నలిస్టుల హక్కుల కోసం పాదయాత్ర చేపట్టిన సందర్భాన్ని ప్రస్తావిస్తూ, అదే స్ఫూర్తితో తెలంగాణలో జర్నలిస్టుల ఇండ్ల స్థలాల కోసం ఈ పోరాటాన్ని ముందుకు తీసుకెళ్తున్నామని తెలిపారు.

**హామీ కాదు.. హక్కుగా ఇండ్ల స్థలాలు ఇవ్వాలి..**
ప్రభుత్వం జర్నలిస్టులకు ఇచ్చిన ఇండ్ల స్థలాల హామీని ఇక ఆలస్యం చేయకుండా అమలు చేయాలని వారు కోరారు. ప్రజాస్వామ్యానికి నాలుగో స్తంభంగా నిలుస్తూ.. ప్రజల సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లే జర్నలిస్టులకు సొంత ఇంటి కల కూడా నెరవేరకపోవడం ఆవేదనకరమన్నారు. ఎన్నో కుటుంబాల కన్నీళ్లను వార్తలుగా మార్చే జర్నలిస్టుల జీవితాల్లోనూ ఒక వెలుగు నింపాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. "ఇండ్ల స్థలాలు సాధించే వరకు ఈ పోరాటం ఆగదు.. జర్నలిస్టుల హక్కు సాధించే వరకు ప్రతి అడుగు ముందుకే" అని టీడబ్ల్యూజేఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సయ్యద్ ఖదీర్, కొత్తపల్లి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. ప్రతి జర్నలిస్టు అడుగు కలపాలి.. ప్రభుత్వం స్పందించాలన్నారు. ఇది ఒక్క సంఘం పోరాటం కాదని.. ఇండ్ల స్థలాల కోసం ఎదురుచూస్తున్న ప్రతి జర్నలిస్టు కుటుంబం యొక్క ఆకాంక్ష అని వారు పేర్కొన్నారు. జిల్లాలోని ప్రతి జర్నలిస్టు ఈ పాదయాత్రలో భాగస్వామి కావాలని పిలుపునిచ్చారు. ఒకరి అడుగు మరొకరికి బలంగా మారాలని, జర్నలిస్టుల ఐక్యతే ప్రభుత్వంపై న్యాయమైన ఒత్తిడిని పెంచుతుందని అన్నారు. జర్నలిస్టుల పాదయాత్రకు మద్దతు తెలిపిన అన్ని రాజకీయ పార్టీల నాయకులు, ప్రజా సంఘాల ప్రతినిధులు, కళాకారులు, మహిళలు, ప్రజలకు టీడబ్ల్యూజేఎఫ్ నాయకులు కృతజ్ఞతలు తెలిపారు. ప్రజల గొంతుకగా నిలిచే జర్నలిస్టుల గొంతును ప్రభుత్వం కూడా ఆలకించి, ఇచ్చిన హామీని అమలు చేస్తూ జర్నలిస్టులకు ఇండ్ల స్థలాలను ప్రకటించాలని వారు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో టీడబ్ల్యూజేఎఫ్ వ్యవస్థాపక జిల్లా అధ్యక్షులు పారుపల్లి కృష్ణారావు, జిల్లా కోశాధికారి తేనె వెంకటేశ్వర్లు, జిల్లా సహాయ కార్యదర్శి కొత్త యాకేష్, జిల్లా కమిటీ సభ్యులు నాగిరెడ్డి, లక్ష్మారెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు తోట వీరభద్రం, మున్సిపాలిటీ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బానోత్ కిషోర్,మద్ది మల్లారెడ్డి,సీపీఐ నాయకులు దండి రంగా రావు,సీపీఎం నాయకులు ఊరడి సుదర్శన్ రెడ్డి, నంద్ర ప్రసాద్,సీపీఐ ఎం.ఎల్ మాస్ లైన్ నాయకులు బందెల వెంకయ్య, యండపల్లి ఉపేందర్,టీడబ్ల్యూజేఎఫ్ ఖమ్మం రూరల్ నాయకులు కామల్ల వెంకట్, స్వరూప్, వీరకుమార్, రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.




## డిప్యూటీ సీఎం చేతుల మీదుగా రాష్ట్రస్థాయి అవార్డు అందుకున్న ఫోటో జర్నలిస్ట్ ముచ్చర్ల శ్రీనివాస్ గౌడ్

**నల్లగొండ,ఆగస్టు 22,(జనంసాక్షి):** ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవాన్ని పురస్కరించుకుని అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమాన్ని శనివారం హైదరాబాద్ ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో ఐఏఎస్ ఆఫీసర్స్ క్లబ్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన రాష్ట్రస్థాయి ఫోటోగ్రఫీ పోటీల్లో ప్రతిభ కనబరిచిన ది హాన్స్ ఇండియా ఫోటో జర్నలిస్ట్ ముచ్చర్ల శ్రీనివాస్ గౌడ్ రాష్ట్రస్థాయి అవార్డును అందుకున్నారు. తెలంగాణ ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, ఇండియా ప్రెస్ క్లబ్ ప్రతినిధులు, జాతీయస్థాయి మీడియా ఎడిటర్ల చేతుల మీదుగా శ్రీనివాస్ గౌడ్ అవార్డును స్వీకరించారు.



## ఏఐవైఎఫ్ అధ్యక్ష, కార్యదర్శులుగా శ్రీనాథ్‌రెడ్డి, రమేష్

**-యువతను విస్మరిస్తున్న పాలకులు - ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు వలీ ఉల్లాఖాద్రి**

**ఉమ్మడి ఖమ్మం జిల్లా బ్యూరో, ఆగస్టు 22(జనంసాక్షి)**
భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) ఖమ్మం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులుగా ఎం. శ్రీనాథ్ రెడ్డి, చింతల రమేష్ ఎన్నికయ్యారు. అరవై మందితో జిల్లా కౌన్సిల్ను, 22 మందితో ఆఫీస్ బేరర్స్ ను ఎన్నుకున్నారు. ఆర్గనైజింగ్ కార్యదర్శిగా మద్దోజు శ్రవణ్, ఉపాధ్యక్షులుగా మామిడాల కిరణ్ సహ పలువురిని మహాసభలో ఎన్నుకున్నారు. ఈనెల 21న చింతకాని మండలం శనివారం సిపిఐ జిల్లా కార్యాలయం లో జరిగిన మీడియా -సమావేశంలో వివరాలను వెల్లడించారు. ఈ సందర్భంగా జరిగిన మీడియా సమావేశంలో ప్రధాన కార్యదర్శి చింతల రమేష్ మాట్లాడుతూ... మహాసభలో 17 తీర్మానాలను ఆమోదించడం జరిగిందని, వాటి అమలు కోసం పోరాట కార్యాచరణ రూపొందించినట్లు ఆయన తెలిపారు. పాలకులు ఇచ్చిన హామీల అమలు కోసం పోరాడతామని స్పష్టం చేశారు.

**-యువతను విస్మరిస్తున్న పాలకులు : వలీ**
పాలక వర్గాలు యువతను విస్మరించి పాలన చేస్తున్నాయని ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు వలీ ఉల్లా ఖాద్రి అన్నారు. ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామని ప్రకటించిన ప్రధాని మోదీ ఉన్న ఉద్యోగాలను ఊడబీకుతున్నారని పేర్కొన్నారు రెండు లక్షల ఉద్యోగాల కల్పన హామీతో అధికారంలోకి వచ్చిన రేవంత్ రెడ్డి అరకొర నోటిఫికేషన్లు






తప్ప భర్తీ చేసింది ఏమీ లేవని ఆరోపించారు. మోదీ ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటుపరం చేస్తూ అంబానీ, అదానీలకు దేశ సంపదను దోచిపెడుతున్నారని ధ్వజమెత్తారు. ముఖ్యంగా విద్యను కాషాయికరణ చేస్తూ హిందూ మతోన్మాద చర్యలకు పాల్పడుతున్నారని ఖాద్రి ఆరోపించారు. దేశ వ్యాప్తంగా యువజన -సమస్యలపై పోరాడుతున్న ఏకైక విద్యార్థి సంఘం ఏఐవైఎఫ్ మాత్రమేనని ఆయన తెలిపారు. మీడియా సమావేశంలో ఏఐవైఎఫ్ మాజీ నాయకులు, జిల్లా నిర్మాణ బాధ్యులు కొండపర్తి గోవిందరావు, ఏఐవైఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు మామిడాల కిరణ్, ఏఐవైఎఫ్ -నగర అధ్యక్షులు దుర్గానాథ్, కార్యదర్శి చిర్రా కృష్ణ ప్రసాద్, తుపాకుల శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

## బాలబాలికకు భద్రమైన బాల్యాన్ని అందించడం మన బాధ్యత

పాఠశాలల్లో చిన్న పిల్లలకు 'గుడ్ టచ్.. బ్యాడ్ టచ్' గురించి సరైన రీతిలో అర్థమయ్యేలా వివరించి చెప్పాలన్నారు. అనవసరపు స్పర్శను గుర్తించి, వెంటనే తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు తెలిపేలా వారిలో ధైర్యాన్ని నింపాలన్నారు. విద్యార్థుల ప్రవర్తనలో ఏవైనా అసాధారణ మార్పులు (భయం, ఒంటరితనం, ఆందోళన) కనిపిస్తే టీచర్లు వెంటనే గమనించాలన్నారు. పిల్లలతో స్నేహపూర్వకంగా ఉంటూ వారి సమస్యలను తెలుసుకుని పరిష్కరించే మార్గదర్శకులుగా నిలవాలన్నారు.బాలల సంరక్షణ అధికారులు తమ విధులను కేవలం ఒక ఉద్యోగంగా కాకుండా, సామాజిక బాధ్యతగా భావించి సమర్థవంతంగా పనిచేయాలన్నారు. బాల్య వివాహాలు, బాలకార్మిక వ్యవస్థ, పిల్లలపై జరుగుతున్న వేధింపులపై తక్షణమే స్పందించి బాధితులకు అండగా నిలవాలన్నారు.

"మొక్కై వంగనిది.. మానై వంగునా.." అనే సామెతను గుర్తు చేస్తూ, బాల్యం నుంచే పిల్లలకు మంచి నడవడిక, బుద్ధులు, నైతిక విలువలు నేర్పించడం చాలా అవసరమని తెలిపారు. బాల్యాన్ని సరైన మార్గంలో తీర్చిదిద్దితేనే వారి భవిష్యత్తు, సమాజ భవిష్యత్తు బాగుంటుందని జిల్లా ప్రధాన న్యాయమూర్తి అన్నారు. కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ మాట్లాడుతూ, నేటి డిజిటల్ యుగంలో సమాజం చాలా వేగంగా మారుతోందని, దీనివల్ల బాలలు ఎదుర్కొంటున్న సమస్యలు, సవాళ్లు కూడా కొత్త రూపు సంతరించుకుంటున్నాయని అన్నారు. అధికారులందరూ చట్ట పరిధిని, తాజా నిబంధనలను క్షుణ్ణంగా అర్థం చేసుకుని, సమర్థవంతంగా విధులు నిర్వహించాలని తెలిపారు. చట్టాల అమలు క్షేత్రస్థాయిలో మాత్రమే స్పష్టమైన ఫలితాలను ఇస్తుందని, అందుకే ప్రాథమిక స్థాయిలో పనిచేసే సిబ్బందికి చట్టాలపై నిరంతరం అవగాహన కల్పించాల్సిన బాధ్యత ఉన్నతాధికారులపై ఉందన్నారు. బాలల సంక్షేమం, హక్కుల కాపాడటంలో ఎలాంటి అలసత్వానికీ తావులేదని స్పష్టం చేశారు. ప్రతి బిడ్డకు సురక్షితమైన వాతావరణం కల్పించేలా జువైనల్ జస్టిస్ యాక్ట్, పోక్సో చట్టం వంటి విధానాలను బాధ్యతాయుతంగా అమలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో న్యాయమూర్తులు డా. పి.పి. కృష్ణ అర్జున్, డా. జి.వి. మహేష్ నాథ్, వి. శ్రీనయ్య, ఎం. శ్రీనివాస్, ఎం. కల్పన, వి. శివ రంజని, టి. మురళి మోహన్, పి. దేవి మానస, షేక్ మీరా ఖాసీం సాహెబ్, కె. జ్యోతిర్మయి, బి. రజని, వై. బిందుప్రియ, ఏ. ప్రవీణ్, బి. నాగలక్ష్మి, జి. అఖిల గౌడ్, వి. దీప్తి, జి. నిష్మ, బి. నాగ సుమ బాల, వి. లావణ్య, జిల్లా బాల సంరక్షణ అధికారిణి విష్ణు వందన, విద్యాశాఖ అధికారులు, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.



## రోగులకు నాణ్యమైన, పౌష్టికాహారం అందించాలి

### - ఉపసర్పంచ్ గుండె వెంకన్న

బూర్గంపహాడ్ ఆగస్టు 22 (జనంసాక్షి)

ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రోగులకు ఆరోగ్యకరమైన, శుచికరమైన, పౌష్టికాహారం అందించాలని ఉపసర్పంచ్ గుండె వెంకన్న సూచించారు. యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో బూర్గంపహాడ్ ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా భోజనం నాణ్యత, పరిశుభ్రతను పరిశీలించడంతో పాటు రోగులతో మాట్లాడి ఆహారం ఎలా ఉందో అడిగి తెలుసుకున్నారు. రోగుల ఆరోగ్య పరిస్థితులకు అనుగుణంగా నాణ్యమైన, పౌష్టికాహారం అందించడంలో అధికారులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని ఆయన కోరారు.అనంతరం ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ గుర్రం ప్రసాద్ మాట్లాడుతూ.. రోగులకు అందించే ఆహారం విషయంలో ఎలాంటి రాజీ ఉండదని, నాణ్యమైన వైద్యం, పౌష్టికాహారం అందించడమే తమ లక్ష్యమని తెలిపారు. ఈ కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ నాయకులు నిమ్మల హరీష్, ఉపసర్పంచ్ గుండె వెంకన్న, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.



## బూర్గంపహాడ్ అభివృద్ధిలో మరో ముందడుగు

### రహదారికి ఇరువైపులా చెట్ల తొలగింపు

బూర్గంపహాడ్ ఆగస్టు 22 (జనంసాక్షి)

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, బూర్గంపహాడ్?లక్ష్మీపురం ప్రధాన రహదారిపై వాహనదారుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని సర్పంచ్ మందా నాగరాజు చెట్లు, పొదలను తొలగించే పనులు చేపట్టారు. రహదారికి ఇరువైపులా పెరిగిన కొమ్మలతో ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించక ప్రమాదాలకు అవకాశం ఉండటంతో జేసీబీ సహాయంతో తొలగింపు పనులు చేపట్టారు. ఈ పనులను సర్పంచ్ నాగరాజు పర్యవేక్షించగా 14వ వార్డు మెంబర్ ఆకుల ఈరమ్మ సహకరించారు. చెట్ల తొలగింపుతో రహదారి స్పష్టంగా కనిపించి వాహనదారులకు ప్రయాణం సురక్షితంగా, సౌకర్యవంతంగా మారనుంది. ప్రజా సమస్యల పరిష్కారానికి వెంటనే స్పందించిన సర్పంచ్‌కు స్థానికులు కృతజ్ఞతలు తెలిపారు.

## సబ్ జూనియర్ బాల్ బ్యాడ్మింటన్ జిల్లా జట్ల ఎంపిక

కల్లూరు ఆగస్టు 22(జనం సాక్షి)



కల్లూరు లోని గ్రీన్‌ఫీల్డ్ మినీ స్టేడియం క్రీడా ప్రాంగణంలో రెండు జిల్లాల స్థాయి సబ్ జూనియర్ బాల్ బ్యాట్మెంటన్ బాలబాలికల జిల్లా జట్ల ఎంపికలు శనివారం జరిగాయి. ఈ పోటీలలో 60 మంది బాలురు 40 మంది బాలికలు పాల్గొని తమలోని క్రీడా నైపుణ్యాన్ని ప్రదర్శించారు. అత్యంత క్రీడ నైపుణ్యాన్ని ప్రదర్శించిన బాల బాలికలను రెండు జట్లుగా 20 మందిని రాష్ట్రస్థాయి సబ్ జూనియర్ బాల్ బ్యాడ్మింటన్ పోటీలలో పాల్గొనేందుకు నిర్వాహకులు ఎంపిక చేశారు. ఎంపికైన క్రీడాకారులు ఈనెల 28, 29 ,30 తేదీలలో హైదరాబాదులోని బి హెచ్ ఎల్ లో జరిగే స్థాయి సబ్ జూనియర్ బాల్ బ్యాట్మెంటన్ పోటీలలో పాల్గొననున్నట్లు పోటీల నిర్వహణ బాధ్యులు ఖమ్మం జిల్లా బాల్ బ్యాట్మెంటన్ అధ్యక్ష కార్యదర్శులు వెజెల్ల సురేష్, బొంతు శ్రీనివాసరావు తెలిపారు. జిల్లా స్థాయి క్రీడా పోటీల లో పాల్గొన్న క్రీడాకారులకు పలువురు దాతలు వ్యాయామ ఉపాధ్యాయులు ఉచిత భోజన వసతి సౌకర్యాలు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలోకొత్తగూడెం జిల్లా అధ్యక్షులు ఉ న్నం నాగేశ్వరరావు కల్లూరు మండల వ్యాయామ ఉపాధ్యాయులు శిక్షకులు పసుపులేటి వీర రాఘవయ్య తల్లపురెడ్డి గౌతం రజిని శ్రీదేవి పద్మ రమాకుమారి వెంకటేశ్వరరావు గోపి తదితరులతోపాటు అబ్దుల్ రహీం మోటమర్రి ప్రభాకర్ .సీనియర్ బాల్ బ్యాట్మెంటన్ క్రీడాకారులు సత్యం తదితరులు పాల్గొన్నారు.



## విద్యార్థులు మత్తు పదార్థాలకు అలవాటు పడకూడదు

### బాల్య వివాహాలు నిర్మూలించాలి

అడ్డగూడూర్/ఆగస్టు 22(జనంసాక్షి )

అడ్డగూడూరు మండల కేంద్రంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల యందు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆదేశానుసారం మండల న్యాయ సేవ అధికార సంస్థ ఆధ్వర్యంలో పాఠశాల విద్యార్థినీ విద్యార్థులకు అవగాహన కల్పించడం జరిగింది . ఈ కార్యక్రమంలో..... సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ దంతూరి సత్తయ్య మాట్లాడుతూ..... బాల్య వివాహాల నిర్మూలన, బాల కార్మిక వ్యవస్థ, బాలల హక్కుల పరిరక్షణ, మరియు 1098,100, 108, 112, తదితర టోల్ ఫ్రీ నెంబర్ల గురించి, విద్యార్థులు డ్రగ్స్ బారిన పడకుండా జాగ్రత్తలు పై అవగాహన కల్పించడం . గుడ్ టచ్, బాడ్ టచ్, మానసిక , శారీరక వేధింపులు ఎదురైనప్పుడు విద్యార్థినీలు అనుసరించాల్సిన పద్ధతులు , మెలకువలు మొదల గు అంశాలపై అవగాహన కల్పించడం జరిగింది. అనంతరం ప్యానల్ అడ్వకేట్లు కూనూరు శ్రీనివాస్ , గడ్డం నరసింహ గార్లు బాల్య వివాహాల నిర్మూలన కొరకు, బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన పై అవగాహన కల్పించడం జరిగింది.పాఠశాల ఇన్చార్జి ప్రధా నోపాధ్యాయులు నరసింహారెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ సమావే శానికి ,ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు సరిత, పోలీసు అధికారి వెంకన్న, పాఠశాల చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్ స్వప్నా దేవి, అగ్రి లీగల్ క్లినిక్ కానుగంటి శ్రీశైలం, పారాలిగల్ వాలంటీర్ కురిమేటి యాదయ్య, ఇటికాల లింగయ్య, ఉపాధ్యాయులు లక్ష్మణ్, మహేష్, నరేష్, వెంకటేష్,కళ్యాణి ,మరియు పాఠశాల విద్యార్థినీ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## సర్పంచ్ జాల యాదయ్య చేతుల మీదుగా

# స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ

### గుర్రంపోడులో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ

గుర్రంపోడు:ఆగస్టు 22 (జనంసాక్షి)

గుర్రంపోడుమండల కేంద్రంలో శనివారం స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమం ఘనంగా జరిగింది. గ్రామ సర్పంచ్ జాల యాదయ్య ముఖ్య అతిథిగా హాజరై లబ్ధిదారులకు ఈ కొత్త కార్డులను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ, అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందాలనే లక్ష్యంతో ఈ కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. స్మార్ట్ రేషన్ కార్డుల ద్వారా పంపిణీ ప్రక్రియ మరింత సులభతరం అవుతుందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో జీపీఓ పురుషోత్తం తో పాటు మండల నాయకులు జాల పెద్ద సత్తయ్య, తగుళ్ల వెంకటయ్య, తగుళ్ల యాదయ్య, కూరాకుల లింగయ్య, జాల నరసింహ, మేడి వెంకన్న పాల్గొన్నారు. అలాగే వార్డు సభ్యులు షేక్ సైదులు, మురళి చారి, అమీర్, గ్రామ పెద్దలు మరియు స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.



## రాష్ట్రపతి చేతుల మీదుగా జోగుల నరసయ్యకు పోలీస్ అవార్డు

### శుభాకాంక్షలు తెలిపిన లక్ష్మాపురం గ్రామస్తులు

రామన్నపేట, ఆగస్టు 22 (జనంసాక్షి):



రామన్నపేట మండలం లక్ష్మాపురం గ్రామానికి చెందిన మాజీ తొలి సర్పంచ్ జోగుల రామలింగయ్య కనిష్ఠ కుమారుడు, సికింద్రాబాద్ అడిషనల్ డిప్యూటీ కమిషనర్ జోగుల నరసయ్య రాష్ట్రపతి చేతుల మీదుగా ఉత్తమ పోలీసు అవార్డు అందుకున్న సందర్భంగా గ్రామస్తులు ఆయనను శాలువాతో సత్కరించి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. మారుమూల ప్రాంతమైన లక్ష్మాపురం గ్రామం నుంచి చిన్ననాటి నుంచే కష్టపడి ఉన్నత స్థాయికి ఎదిగి, రాష్ట్రపతి చేతుల మీదుగా ప్రతిష్టాత్మక అవార్డు అందుకోవడం గ్రామానికి గర్వకారణమన్నారు. పోలీసు అధికారిగా బాధ్యతలు నిర్వర్తించడంతోపాటు గ్రామ అభివృద్ధికి కూడా నరసయ్య అనేక సందర్భాల్లో తనవంతు సహకారం అందించారని కొనియాడారు.భవిష్యత్తులోనూ గ్రామ అభివృద్ధిలో కీలకపాత్ర పోషిస్తూ మరిన్ని సేవలు అందించాలని ఆకాంక్షించారు. నరసయ్యకు అవార్డు రావడం గ్రామ యువతకు స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు.అభినందనలు తెలిపిన వారిలో మాజీ సర్పంచ్ ఉప్పు ప్రకాష్, శంభాల వెంకటేష్, నీల ఐలయ్య, మరోజు అనంతచారి, బత్తిని వెంకటేష్, వేముల పాపయ్య, బత్తుల రమేష్, ఆరూరి నరేష్, వంగల మల్లికార్జున్ తదితరులు ఉన్నారు.

## రీ-సర్వే డేటా ఎంట్రీ తప్పు లేకుండా

### నమోదు చేయాలి :కలెక్టర్ దివాకర టిఎస్

నమోదవుతాయని కలెక్టర్ తెలిపారు.రీ?సర్వే ద్వారా నమోదు చేసే భూ వివరాలు భవిష్యత్‌లో అనేక సంవత్సరాల పాటు ఉపయోగ పడతాయని, అందువల్ల డేటా ఎంట్రీ సమయంలో ప్రతి వివరాన్ని ఒకటికి రెండుసార్లు పరిశీలించి నమోదు చేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు. రీ?సర్వే పూర్తయిన అనంతరం భూ వివరాలతో పాటు కోఆర్డినేట్లతో కూడిన మ్యాప్‌ను అందించడం జరుగుతుం దని జిల్లా కలెక్టర్ తెలిపారు. ప్రతి భూమికి సంబంధించిన వివరాలు ఖచ్చితంగా నమోదయ్యేలా సర్వే బృందాలు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు.సర్వే ప్రక్రియలో క్షేత్రస్థాయిలో గుర్తించిన వివరాలు, డేటా ఎంట్రీలో నమోదు చేసిన వివరాలకు పూర్తి అనుసంధానం ఉండేలా అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని కలెక్టర్ సూచించారు.ఈ పర్యటనలో జిల్లా కలెక్టర్ వెంట కూసుమంచి తహసీల్దార్ సైదులు, ఆర్ఐ జ్యోతి , సర్వే అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# హౌస్ కీపర్లు,ఆఫీస్ సబార్డినేట్లను జేపీఏలుగా కన్వర్షన్ చేయండి

**బీటీపీయస్ చీఫ్ ఇంజనీర్ బిచ్చన్న కు వినతిపత్రం ఇచ్చిన టి ఎస్ పి ఈ యు-1535 నాయకులు..**



కొత్తగూడెం క్రైమ్, ఆగస్టు22 (జనం సాక్షి): భద్రాద్రి కొత్తగూడెం జిల్లాబిటిపిఎస్ లో పనిచేస్తున్న హౌస్ కీపర్లు,ఆఫీస్ సబార్డినేట్లను జేపీఎ ( జూనియర్ ప్లాంట్ అటెండెంట్ )లుగా కన్వర్షన్ చేయాలని ( తెలంగాణ స్టేట్ పవర్ ఎంప్లాయిస్ యూనియన్)-1535 నాయకులు ఆ కర్మాగార చీఫ్ ఇంజనీర్ బి.బిచ్చన్న ను కోరారు.టి ఎస్ పి ఈ యు1535 రీజినల్ అధ్యక్షులు వి. ప్రసాద్, స్టేట్ జాయింట్ సెక్రటరీ ఏ. వెంకటేశ్వర్లు, కోశాధికారి పి. శ్రీనివాస్ తదితరులు బిటిపిఎస్ చీఫ్ ఇంజనీర్ కార్యాలయంలో శనివారం ఆయన కలసి వినతి పత్రం ఇచ్చారు. అనంతరం పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకొని వెళ్లారు. 31,ఆగస్టు2026 తేది వరకు ఐదు ఇంక్రిమెంట్లు తీసుకున్న హౌస్ కీపర్ లను జేపీలుగా కన్వెన్షన్ చేసేందుకు జెన్కో ఇటీవల సర్కులర్ విడుదల చేసిందని చెప్పారు. అయితే ఈ గడువుని 30,నవంబర్ 2026 వరకు పొడగించాలని కోరారు.ఈ మూడు నెలలు పొడిగిస్తే హౌస్ కీపర్ లందరూ జెపిఏ లుగా కన్వర్షన్ అవుతారని గుర్తు చేశారు. కర్మాగారం లో ఐదు సంవత్సరాలు సర్వీస్ పూర్తి చేసీ...పదో తరగతి పాసైన ఆఫీస్ సబర్డేనేట్ల అందరిని జెపిఎ లుగా కన్వర్షన్ చేసే జీవో ఉందని చెప్పారు. ఈ జీవో ను అనుసరించి ఆఫీస్ సబార్డినేట్లను జెపిఎ గా కన్వర్షన్ చేయాలని కోరారు. భూ నిర్వాసిత కోటాలో నియమితులైన జూనియర్ అసిస్టెంట్ల సర్వీసును డేటాఫ్ జాయినింగ్, డేట్ అఫ్ బర్త్ ను పరిగణలోకి తీసుకొని నిర్ణయించాలని పేర్కొన్నారు.

హౌస్ కీపర్ లకు గడువు పెంచేందుకు,ఆఫీస్ సబార్డినేట్లను జెపిఎలు గా కన్వర్షన్ చేసేందుకు చీఫ్ ఇంజనీర్ సానుకూలంగా స్పందించారు. జూనియర్ అసిస్టెంట్ల సీనియారిటీని నిబంధనలను అనుసరించి నిర్ణయిస్తామని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ఆఫీస్ సబార్డినేట్లు గౌస్ పాషా,కళ్యాణ్, రాము, నరసింహారావు, అప్పియ,కళ్యాణి తదితరులు పాల్గొన్నారు. ఫోటో రైట్ అప్: బీటీపీయస్ చీఫ్ ఇంజనీర్ కి వినతిపత్రం ఇస్తున్న టీఎస్ పీఈయు-15 35 నాయకులు.

# ఎంఈఓ మురళి మోహన్ రావుపై సర్పంచుల ఆగ్రహం




ఎర్రుపాలెం, ఆగస్టు 22 (జనంసాక్షి): మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయం లో ఎంపీడీవో ఎం.ఎస్.ఎస్. శారదాదేవి అధ్యక్షతన శనివారం మండల స్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ శాఖల మండల అధికారులు తమ శాఖల ప్రగతి నివేదికలను వెల్లడించారు. సమావేశంలో పలువురు సర్పంచులు మండల విద్యాశాఖ అధికారి మురళీమోహన్‌రావు తీరుపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. విధుల నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తున్నారని, పలు అంశాల్లో అవకతవకలకు పాల్పడుతున్నారని ఆరోపిస్తూ సమస్యలపై ఎంఈఓను నిలదీశారు. కనీసం సర్పంచులు తమ గ్రామాల్లో నెలకొన్న సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చినా వాటిని పరిగణనలోకి తీసుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజాప్రతినిధులు సూచించిన సమస్యల పరిష్కారానికి స్పందించకపోవడం సరికాదని పేర్కొన్నారు.కొన్ని గ్రామపంచాయతీల పరిధిలోని పాఠశాలల అభివృద్ధి పనులకు సంబంధించి సర్పంచులకు సమాచారం ఇవ్వకుండా ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. పాఠశాలల అభివృద్ధి, మౌలిక వసతుల కల్పన వంటి అంశాల్లో గ్రామపంచాయతీలతో సమన్వయం చేసుకోవాలని సూచించారు. అనంతరం గ్రామాల్లో మౌలిక వసతుల కల్పన, పాఠశాలల అభివృద్ధి, వివిధ శాఖల ప్రగతి తదితర అంశాలపై చర్చించారు. అలాగే ఎర్రుపాలెం పశు సంవర్ధక శాఖ వైద్యులు శివ కుమార్ని గ్రామాల్లో కోతుల బెడద కుక్కల స్థిర విహారంపై సర్పంచులు నిర్మూలన చర్యలు చేపట్టాలని కోరారు. తాసిల్దార్ సునీత ఎలిజిబెత్, మాట్లాడుతూ మండలంలో నూతనంగా వచ్చిన రేషన్ డిజిటల్ స్మార్ట్ కార్డు లు త్వరలో పంపిణీ చేయనున్నట్లు తెలిపారు.మండలంలో చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలను ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో ముందుకు తీసుకెళ్లాలని నిర్ణయించారు.

ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ బండారు నరసింహారావు, మండల ప్రత్యేక అధికారి ఫిరంగి, తహసీల్దార్ సునీతా ఎలిజబెత్,ఎంపీడీవో ఎం.ఎస్.ఎస్. శారదాదేవి, ఎంపీఓ కృష్ణ, ఆర్ఐ రవికుమార్, శిరీష, రెవెన్యూ సిబ్బంది మండల పరిషత్ కార్యాలయం సిబ్బంది, సర్పంచులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# సామాజిక సేవ పై అవగాహన సదస్సు




ఖమ్మం, (జనంసాక్షి) :

ఏ ఎస్ ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల, శాంతినగర్, ఖమ్మం నందు ఈరోజు "(సోషల్ సర్వీస్) ? సామాజిక సేవ" అనే అంశంపై విద్యార్థులకు ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి అన్నం సేవా ఫౌండేషన్ వ్యవస్థాపకులు అన్నం శ్రీనివాసరావు ముఖ్యఅతిథిగా విచ్చేసి విద్యార్థులను ఉద్దేశించి సామాజిక సేవ యొక్క ఆవశ్యకత, ప్రాధాన్యత, సేవా దృక్పథం, మానవతా విలువలు మరియు సమాజం పట్ల ప్రతి ఒక్కరి బాధ్యత వంటి అంశాలపై స్ఫూర్తిదాయకమైన ప్రసంగం చేశారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ రూపన గోవింద రావు మాట్లాడుతూ,శ్రీ అన్నం శ్రీనివాసరావు సేవా ప్రస్థానాన్ని విద్యార్థులకు పరిచయం చేస్తూ, ఆయన చేస్తున్న విశిష్ట సేవలను కొనియాడారు. అన్నం సేవా ఫౌండేషన్ ఆశ్రమంలో సుమారు 250 మంది అనాథలు, మానసిక వికలాంగులు, శారీరక వికలాంగులు మరియు ఆశ్రయం అవసరమైన వారు నివసిస్తూ సేవలు పొందుతున్నారని తెలిపారు. వారికి శ్రీ అన్నం శ్రీనివాసరావు ఒక తండ్రిలా, గురువులా, సంరక్షకుడిలా, వైద్యుడిలా నిరంతరం అండగా నిలుస్తూ వారి బాగోగులను చూసుకుంటున్నారని పేర్కొన్నారు. ఆశ్రమంలోని అనాథలు, వికలాంగులు మరియు నిరాశ్రయుల పట్ల ఆయన చూపిస్తున్న ప్రేమ, ఆప్యాయత, బాధ్యతాభావం మానవతకు గొప్ప ఉదాహరణగా నిలుస్తున్నాయని అన్నారు. సమాజంలో ఎవరూ అనాథలుగా, నిరాధారులుగా మిగలకూడదనే గొప్ప సంకల్పంతో ఆయన చేస్తున్న సేవలు ఎంతోమందికి స్ఫూర్తిదాయకంగా నిలుస్తున్నాయని తెలిపారు. విద్యార్థులకు విద్యతో పాటు మానవతా విలువలు, సామాజిక బాధ్యత మరియు సేవా దృక్పథం కూడా అవసరమని అన్నారు. "చదువుతో పాటు సేవ ? సేవతో పాటు సమాజ అభివృద్ధి" అనే భావన ప్రతి విద్యార్థి జీవితంలో భాగం కావాలని ఆకాంక్షించారు. అన్నం శ్రీనివాసరావు సేవా ప్రస్థానం విద్యార్థులకు ఒక గొప్ప ఆదర్శమని అధ్యాపకులు పేర్కొన్నారు. ముఖ్యంగా కరోనా మహమ్మారి సమయంలో ఆయన చేసిన సేవలను కొనియాడారు. ప్రాణాలకు సైతం లెక్కచేయకుండా కరోనా బాధితులకు సహాయం చేయడంతో పాటు, కరోనా కారణంగా మరణించిన వేలాది మంది మృతదేహాలకు అంత్యక్రియలు నిర్వహించి మానవత్వానికి నిలువెత్తు నిదర్శనంగా నిలిచారని అన్నారు.

కరోనా సమయంలో కుటుంబ సభ్యులు సైతం తమ ఆత్మీయుల దగ్గరకు వెళ్లలేని అత్యంత క్లిష్ట పరిస్థితుల్లో, ఎలాంటి భయాందోళనలకు గురికాకుండా శ్రీ అన్నం శ్రీనివాసరావు గారు ముందుకు వచ్చి అంత్యక్రియలు నిర్వహించడం ఆయనలోని అపారమైన మానవతా భావం, ధైర్యం, సేవా తపన మరియు బాధ్యతాభావానికి నిదర్శనమని ప్రిన్సిపాల్ గారు పేర్కొన్నారు.

కరోనా సమయంలో ఆయన చేసిన విశిష్ట సేవలను గుర్తించిన బోర్డ్ ఆఫ్ ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్ వారు, ఈ విద్యా సంవత్సరంలో ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం ఇంగ్లీష్ పాఠ్యపుస్తకంలో "ఝ్ట్రవ చిజీతీతిజీనీతీ చిష్ట్రనీ ఃతీనీనీవ ంశ్రీశ్రీ ఃజీతీతీతివతీబ" అనే ప్యాసేజ్‌ను సిలబస్‌లో చేర్చడం ఆయన సేవలకు లభించిన గొప్ప గుర్తింపుగా పేర్కొన్నారు. ఆయన సేవా ప్రస్థానం నేటి యువతకు ఆదర్శప్రాయమని అన్నారు.

"మానవ సేవే మాధవ సేవ" అనే స్ఫూర్తికి ప్రతిరూపంగా నిలుస్తున్న శ్రీ అన్నం శ్రీనివాసరావు గారిని ఈ సందర్భంగా కళాశాల తరఫున ఘనంగా సత్కరించారు. ఖమ్మం జిల్లాకు చెందిన వ్యక్తిగా మానవతా సేవలను విస్తృతంగా అందిస్తూ ఎందరో నిరాశ్రయులకు అండగా నిలవడం ఖమ్మం జిల్లాకు గర్వకారణమని ప్రిన్సిపాల్ గారు పేర్కొన్నారు.

**శ్రీ అన్నం శ్రీనివాసరావు గారి సందేశం**

అనంతరం ముఖ్యఅతిథి శ్రీ అన్నం శ్రీనివాసరావు గారు మాట్లాడుతూ, విద్యార్థి దశ నుంచే సేవా భావం, మానవతా విలువలు, సామాజిక బాధ్యత, క్రమశిక్షణ మరియు సహకార భావనలను పెంపొందించుకోవాలని సూచించారు.

సమాజంలో ఆర్థికంగా, సామాజికంగా వెనుకబడిన వారికి సహాయం చేయడం, వృద్ధులు, అనాథలు, నిరుపేదలు, వికలాంగులు మరియు అవసరంలో ఉన్నవారికి అండగా నిలవడం ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని తెలిపారు.

సామాజిక సేవ అనేది కేవలం ఆర్థిక సహాయం చేయడానికే పరిమితం కాదని ఆయన వివరించారు. ఒకరికి అవసరమైన సమయంలో సమయం కేటాయించడం, విద్యపై అవగాహన కల్పించడం, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడం, పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములు కావడం, రక్తదానం చేయడం, ప్రమాదాల్లో ఉన్నవారికి సహాయం చేయడం, ప్రజలకు ఆరోగ్యం మరియు విద్యపై అవగాహన కల్పించడం వంటి అనేక కార్యక్రమాలు కూడా సామాజిక సేవలో భాగమేనని తెలిపారు.

విద్యార్థులు తమ జ్ఞానం, ప్రతిభ, శక్తి మరియు సమయాన్ని సమాజ అభివృద్ధికి వినియోగించాలని ఆయన పిలుపునిచ్చారు.

"సమాజం మనకు ఎంతో ఇచ్చింది? మనం కూడా సమాజానికి ఏదో ఒక రూపంలో తిరిగి ఇవ్వాలి" అనే ఆలోచన ప్రతి విద్యార్థిలో ఉండాలని ఆకాంక్షించారు.

యువతే సమాజంలో సానుకూల మార్పుకు ప్రధాన శక్తి అని పేర్కొంటూ, విద్యార్థులు తమ చుట్టూ ఉన్న సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి తమ వంతు కృషి చేయాలని సూచించారు. చిన్న చిన్న సేవా కార్యక్రమాలే భవిష్యత్తులో గొప్ప సామాజిక మార్పులకు దారితీస్తాయని తెలిపారు.

**కార్యక్రమంలో పాల్గొన్న ప్రముఖులు**

ఈ కార్యక్రమంలో మిమిక్రీ ఆర్టిస్ట్ శ్రీ కూతురు కృష్ణమూర్తి గారు, శాంతినగర్ హైస్కూల్ హెచ్ఎం శ్రీ కృపా బాలానందం గారు, కళాశాల అధ్యాపకులు, సిబ్బంది మరియు విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

కార్యక్రమం ముగింపు సందర్భంగా విద్యార్థులు సామాజిక సేవా కార్యక్రమాలలో చురుకుగా పాల్గొని, మానవత, క్రమశిక్షణ, సహకారం, బాధ్యత మరియు సేవా భావం వంటి విలువలను తమ జీవితంలో అలవర్చుకోవాలని అధ్యాపకులు సూచించారు.

విద్యార్థుల్లో సామాజిక సేవ పట్ల అవగాహన కల్పించడంతో పాటు, సమాజం పట్ల బాధ్యతను గుర్తుచేసి, "చదువుతో పాటు సేవ ? సేవతో పాటు సమాజ అభివృద్ధి" అనే గొప్ప స్ఫూర్తిని అందించిన ఈ అవగాహన సదస్సు విజయవంతంగా ముగిసింది.

మానవ సేవకు ప్రతిరూపంగా నిలిచిన శ్రీ అన్నం శ్రీనివాసరావు గారికి యాఖీ ప్రభుత్వ జూనియర్ కళాశాల తరఫున హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేస్తున్నాము.



# ఆటో కార్మికుల సమ్మెను విజయవంతం చేయండి

**ఈ నెల 24 నుంచి నిరవధిక సమ్మె**

**సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు పిట్టల అర్జున్**

అన్నపురెడ్డిపల్లి, ఆగస్టు 22 (జనంసాక్షి) ఆటో కార్మికుల సమస్యల పరిష్కారం కోసం జేఏసీ ఆధ్వర్యంలో ఈ నెల 24 నుంచి చేపట్టనున్న నిరవధిక సమ్మెను విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు పిట్టల అర్జున్ పిలుపునిచ్చారు. శనివారం అన్నపురెడ్డిపల్లి స్థానిక ఆటో అడ్డా వద్ద నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు.కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే ఇతర రాష్ట్రాల మాదిరిగా ఆటో డ్రైవర్లకు నెలకు రూ.12 వేల ఆర్థిక సహాయం అందిస్తామని హామీ ఇచ్చి, అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ హామీని విస్మరించిందని ఆయన విమర్శించారు. మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించడంతో ఆటో డ్రైవర్ల జీవనోపాధిపై తీవ్ర ప్రభావం పడిందని, వారిని ఆదుకుంటామని చెప్పిన ప్రభుత్వం ఆ దిశగా చర్యలు చేపట్టడం లేదన్నారు.ఆర్టీసీలో ఎలక్ట్రిక్ ఆటోలను ప్రవేశపెడతామని ప్రభుత్వం ప్రకటించిన నేపథ్యంలో ఇప్పటికే ఆటో డ్రైవర్ల వద్ద ఉన్న ఈవీ ఆటోలను ప్రజా రవాణా వ్యవస్థలో వినియోగించేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఆర్టీసీ తర్వాత ప్రజా రవాణా వ్యవస్థలో ఆటో రంగం కీలక పాత్ర పోషిస్తోందన్నారు. ఆటో డ్రైవర్లు ప్రమాదాలకు గురైనప్పుడు వారి కుటుంబాలు ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి తగిన సహాయం అందడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఆటో, ఇతర రవాణా రంగ కార్మికుల కోసం ప్రత్యేక సంక్షేమ బోర్డు ఏర్పాటు చేసి సామాజిక భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు.సమ్మెను విజయవంతం చేసేందుకు ఆటో కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని అర్జున్ కోరారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యులు రఘు, ఆటో డ్రైవర్లు రవి, చెన్నారావు, రాము, ముఖర్జీ, శివరామకృష్ణ, శ్రీను, ప్రభు, నాగేశ్వరావు తదితరులు పాల్గొన్నారు.





## జీవో 97 రద్దు చేయాలని బీఆర్ఎస్ నిరసన

**మాజీ ఎమ్మెల్యే తాటి వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో ఆందోళన**

అన్నపురెడ్డిపల్లి, ఆగస్టు 22 (జనంసాక్షి) జీవో నంబర్ 97ను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ అన్నపురెడ్డిపల్లి మండల బీఆర్ఎస్ నాయకులు, విద్యార్థి, యువజన విభాగాల ఆధ్వర్యంలో శనివారం మండల కేంద్రంలో నిరసన చేపట్టారు. అశ్వారావుపేట మాజీ ఎమ్మెల్యే తాటి వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించిన అనంతరం రోడ్డుపై నిరసన తెలిపారు. జీవో 97ను రద్దు చేయాలని, రాష్ట్ర ప్రభుత్వం తమ డిమాండ్‌ను వెంటనే పరిష్కరించాలని నాయకులు నినాదాలు చేశారు. కార్యక్రమంలో పానుగంటి రాఘవులు, పరస మాధవ, ఇనపనూరి రాంబాబు, చల్లా రమేష్, లాకవత్ వెంకటేశ్వర్లు, వడ్డేపల్లి వెంకటేశ్వర్లు, చల్లా రాంబాబు, లాకవత్ సత్య, పాడే చెన్నారావు, యాదల శ్రావణ్, టీంకు, తేజావత్ వస్త్రం, తేజావతి శివ, బలరాం, కాసాని శ్రీను, గుగులోతు బాబురావుతో పాటు బీఆర్ఎస్ నాయకులు, అభిమానులు, విద్యార్థి, యువజన విభాగాల ప్రతినిధులు పాల్గొన్నారు.



పేరువంచ కుప్పెనకుంట్ల రహదారి నిర్మాణ సమస్యపై

## క్షేత్రస్థాయి పరిశీలన చేసిన సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్

కల్లూరు ఆగస్టు 22(జనంసాక్షి) రైతులు ప్రజల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకొని పేరువంచ నుండి కుప్పెనకుంట్ల మార్గంలో రహదారి నిర్మాణానికి సంబంధించిన సమస్యపై శనివారం కల్లూరు సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్ రహదారి పరిస్థితిని, సంబంధిత సమస్యలను క్షేత్రస్థాయిలో సమగ్రంగా పరిశీలించారు. ఈ సందర్భంగా సంబంధిత శాఖల అధికారులతో పాటు, సమీపాన గల పంట పొలాల ప్రభావిత రైతులతో చర్చించి, వారి సమస్యలు అభ్యంతరాలను తెలుసుకున్నారు. సమస్యకు సాధ్యమైన పరిష్కార మార్గాలపై అధికారులతో సమీక్షించి, అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసి ప్రజలు రైతుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని చట్టబద్ధమైన, ఆచరణ సాధ్యమైన సానుకూల పరిష్కారం అందించే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు.సంబంధిత శాఖల నివేదికలు సిఫారసుల ఆధారంగా తదుపరి చర్యలు చేపట్టనున్నట్లు సబ్ కలెక్టర్ తెలియజేశారు.

## దృఢ సంకల్పంతో లక్ష్యాన్ని సాధించాలి- రత్న దీపిక

బూర్గంపహాడ్ ఆగస్టు 22 (జనంసాక్షి) గర్ల్ చైల్డ్ ఎంపవర్‌మెంట్ కార్యక్రమంలో భాగంగా బూర్గంపహాడ్ మండలం సారపాకలోని పీఎం శ్రీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బాలికల కోసం ప్రత్యేక అవగాహన సభ నిర్వహించారు. ప్రధానోపాధ్యాయురాలు దూద అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి పాఠశాల పూర్వ విద్యార్థిని కుమారి కింతాడి రత్న దీపిక రోల్ మోడల్‌గా హాజరై విద్యార్థినులకు స్ఫూర్తిదాయకంగా ప్రసంగించారు. జీవితంలో ఒక లక్ష్యాన్ని నిర్దేశించుకుని, దానిని సాధించే క్రమంలో ఎదురయ్యే ఆటంకాలను దృఢ సంకల్పంతో అధిగమించాలని రత్న దీపిక సూచించారు. లక్ష్య సాధనకు క్రమశిక్షణ, పట్టుదల ఎంతో అవసరమని, సెల్‌ఫోన్‌తో విలువైన సమయాన్ని వృథా చేసుకోవద్దని విద్యార్థినులకు సూచించారు. తాను ప్రభుత్వ పాఠశాలలో, ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో విద్యాభ్యాసం పూర్తి చేసి ప్రస్తుతం గ్రాన్యూల్స్ ఇండియా లిమిటెడ్ కంపెనీలో సీనియర్ టెక్నికల్ అసోసియేట్‌గా పనిచేస్తున్నట్లు తెలిపారు. విద్య ద్వారానే మహిళా సాధికారత సాధ్యమవుతుందని పేర్కొన్నారు. తన విజయ ప్రస్థానంలో తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు అందించిన ప్రోత్సాహం ఎంతో కీలకమని తెలిపారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయురాలు మాట్లాడుతూ కడు పేదరికం నుంచి కష్టపడి ఉన్నత స్థాయికి ఎదిగిన రత్న దీపికను ప్రతి బాలిక ఆదర్శంగా తీసుకుని ఉన్నత లక్ష్యాలను సాధించాలని ఆకాంక్షించారు. అనంతరం రత్న దీపికను మెమొంటో అందించి, శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు కే. శ్రీదేవి, టీ. కృష్ణవేణి, సీహెచ్. హేమ, బి. స్వరూప, పి. శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



## హరీష్ రావును మర్యాదపూర్వకంగా కలిసిన రేగా కాంతారావు



అశ్వాపురం ఆగస్టు 22 (జనంసాక్షి): బీఆర్ఎస్ పార్టీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్, మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీష్ రావును భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు, పినపాక మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు శనివారం హైదరాబాద్ కోకాపేటలోని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా పార్టీకి సంబంధించిన పలు అంశాలపై నాయకులు చర్చించినట్లు తెలిపారు. రేగా కాంతారావుతో పాటు అశ్వాపురం మండల బీఆర్ఎస్ అధ్యక్షుడు కోడి అమరేందర్ యాదవ్, పినపాక బీఆర్ఎస్ అధ్యక్షుడు పగడాల సతీష్ రెడ్డి, అశ్వాపురం బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి మర్రి మల్లారెడ్డి, మాజీ ఎంపీపీ కొల్లు మల్లారెడ్డి, మిట్టకంటి సురేందర్ రెడ్డి తదితర నాయకులు పాల్గొన్నారు.

## 24 గ్రామ పంచాయతీలకు కాంగ్రెస్ కమిటీలు.. పార్టీ బలోపేతమే లక్ష్యం

అశ్వాపురం ఆగస్టు 22 (జనంసాక్షి): మండలంలోని 24 గ్రామ పంచాయతీలకు ఏర్పాటు చేసిన కాంగ్రెస్ పార్టీ కమిటీల జాబితాను జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు తోట దేవి ప్రసన్నకు మండల కాంగ్రెస్ నాయకులు అందజేశారు.మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ఓరుగంటి రమేష్ బాబు ఆధ్వర్యంలో ఈ జాబితాను అందజేస్తూ, గ్రామస్థాయిలో పార్టీని మరింత బలోపేతం చేయడంతో పాటు కార్యకర్తలను సమన్వయం చేసుకుంటూ ప్రభుత్వ కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లడమే కమిటీల ప్రధాన ఉద్దేశమని నాయకులు తెలిపారు.కార్యక్రమంలో సీనియర్ నాయకులు గాదె కేశవరెడ్డి, ఎస్కె గాలిబ్, యూత్ కాంగ్రెస్ వైస్ ప్రెసిడెంట్ వేముల విజయ్ తదితరులు పాల్గొన్నారు.



## ఐయూఎంఎల్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధిగా షేక్ బాజీ బాబా నియామకం

ఖమ్మం, (జనంసాక్షి) : ఇండియన్ యూనియన్ ముస్లిం లీగ్ పార్టీ తెలంగాణ రాష్ట్ర అధికార ప్రతినిధిగా షేక్ బాజీ బాబా నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర అధ్యక్షుడు అడ్వకేట్ మహమ్మద్ షకీల్, హైదరాబాద్ పార్టీ కార్యాలయంలో షేక్ బాజీ బాబాకు నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షుడు అడ్వకేట్ మహమ్మద్ షకీల్ మాట్లాడుతూ, పార్టీ సమావేశాలు అదేవిధంగా, పార్టీ అభివృద్ధి కోసం, మీడియా సమావేశాలు ప్రజా సమస్యలపై గొంతుకగా అధికార ప్రతినిధిగా బాజీ బాబాలు నియమించడం జరిగిందని ఆయన తెలియజేశారు. ఈ సందర్భంగా తనపై పెద్ద ఎత్తున బాధ్యతను అందజేసిన రాష్ట్ర నాయకత్వానికి కృతజ్ఞతలు తెలియజేస్తూ, జాతీయ అధ్యక్షుడు ఖాదర్ మొయిద్దీన్ , జాతీయ ప్రధాన కార్యదర్శి కేరళ మంత్రివర్యులు కునాల్ కుట్టి ఆశీస్సులతో, తెలంగాణ రాష్ట్ర కమిటీ వారికి ధన్యవాదాలు కృతజ్ఞతలు తెలియజేశారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం వారి పక్షాన నిలబడి తన గొంతుకను వినిపిస్తానని, పార్టీ అభివృద్ధి కోసం పార్టీ తనపై పెట్టిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా తెలంగాణ రాష్ట్రంలో పార్టీని అభివృద్ధి చేస్తానని ఈ సందర్భంగా ఆయన తెలియజేశారు. దేశవ్యాప్తంగా ఐదుగురు ఎంపీలు 26 మంది ఎమ్మెల్యేలు తమిళనాడు కేరళ రెండు రాష్ట్రాలలో ప్రభుత్వంలో భాగస్వాములుగా తమ పార్టీ ఉందని, పార్టీ కోసం నిరంతరం పార్లమెంట్లో ప్రశ్నించే తమ ఎంపీలు ఉన్నారని ఇలాంటి పెద్ద పార్టీలో తాను పనిచేయటం చాలా గర్వంగా ఉందని పార్టీ ఇచ్చిన ఏ బాధ్యతను అయినా క్రమశిక్షణతో నిర్వహిస్తానని ఈ సందర్భంగా ఆయన అన్నారు.



# గ్రామంలో పారిశుద్ధ్యానికి పెద్దపీట

## గ్రామ సర్పంచ్ డాక్టర్ వేమూరి సత్యనారాయణ



**మునగాల, ఆగష్టు 22 (జనంసాక్షి):** మండల పరిధిలోని నరసింహాపురం గ్రామ పంచాయతీ లో గ్రామ సర్పంచ్ డాక్టర్ వేమూరి సత్యనారాయణ ఆధ్వర్యంలో పారిశుద్ధ్య కార్యక్రమాలు శరవేగంగా జరుగుతున్నాయి. గ్రామంలో ప్రతి వీధి వీధిలో ఉన్న డ్రైనేజీలు శుభ్రపరచి దోమల మందు పిచికారి చేసి తదుపరి డ్రైనేజీలో బ్లీచింగ్ పౌడర్ ను చల్లి దోమల నివారణ కు తగు చర్యలు తీసుకుంటున్నామని గ్రామ సర్పంచ్ డాక్టర్ వేమూరి సత్యనారాయణ తెలిపారు. శనివారం ఆయన గ్రామంలోని పురవీదులను పర్యవేక్షిస్తూ మీడియాతో మాట్లాడారు. దోమల మందును పొగ ద్వారా దోమలు వ్యాప్తి చెందకుండా తగు జాగ్రత్తలు తీసుకుంటున్నామని గ్రామ సర్పంచ్ డాక్టర్ వేమూరి సత్యనారాయణ తెలిపారు. గ్రామంలో పారిశుద్ధ్యానికి పెద్దపీట వేస్తూ పరిసరాలను ఎప్పటికప్పుడు గ్రామ పంచాయతీ సిబ్బందితో వీధులను శుభ్రం చేస్తూ ప్రతి శుక్రవారం వైద్య సిబ్బందితో పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ప్రజలకు అవగాహన కల్పిస్తూ గ్రామంలో ఉన్న వీధులతోపాటు గ్రామ ప్రజలు కూడా వారి వారి ఇల్లు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, అలాగే గ్రామంలో ఎలాంటి నీటి కొరత లేకుండా తగు జాగ్రత్తలు తీసుకుంటున్నామని, ఎప్పటికప్పుడు విద్యుత్ వీధి దీపాలను ఏర్పాటు చేస్తూ ప్రజలు ఎలాంటి అసౌకర్యాలకు లోను కాకుండా తగు జాగ్రత్తలు తీసుకుంటున్నామని, అలాగే ప్రజలు కూడా సహకరించి వీధుల్లో చెత్త వేయకుండా, రోడ్లమీద పశువులను కట్టేయకుండా, ఎవరు బహిరంగ మలవిసర్జన చేయకుండా, ప్రతి ఒక్కరూ మరుగుదొడ్లను నిర్మించుకోవాలని, గ్రామాన్ని పచ్చదనం పరిశుభ్రతలో, ముందు ఉంచాలని, దీనికి గ్రామ ప్రజలందరూ సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ రెడ్డబోయిన ప్రశాంత్, వార్డు సభ్యులు షేక్ అజీజ్ మియా, పచ్చిపాల అశ్విని, వీరబోయిన నరేష్, కేశగాని కామేశ్వరి, రేవూరి కళ్యాణి, మీసాల బిక్షం, గ్రామ పెద్దలు బొమ్మ చిన్న వెంకన్న, కేశగాని వెంకన్న, రేవూరి బాబు, పంచాయతీ కార్యదర్శి బాలరాజు, గ్రామ పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

### సాగర్ నీటి విడుదల షెడ్యూల్ ను

# వెంటనే విడుదల చేయాలి

## రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు దేవరం వెంకటరెడ్డి డిమాండ్



**మునగాల, ఆగష్టు 22(జనంసాక్షి):** ఈ సంవత్సరం ఎలినినో కారణంగా సరియైన వర్షాలు పడని కారణంగా నాగార్జునసాగర్ డ్యాములోనికి తగినంత నీరు లేని కారణంగా సాగర్ ఆయకట్టుకు వరి సాగుకు నీరు ఇవ్వలేమని ప్రభుత్వం చెప్తున్నారని, కానీ అగ్రికల్చర్ రెవెన్యూ డిపార్ట్మెంట్ వారు సాగర్ ఆయకట్టులో వరి వేయవద్దు అని ఆరుతడి పంటలు మాత్రమే వేయాలని రైతాంగానికి పదేపదే చెప్పుచున్నారని, కానీ ఆరుతడి పంటలకు ఏఏ రోజుల్లో సాగర్ నీరు వదులుతారని మాత్రం చెప్పడం లేదని, దీంతో రైతాంగం అయోమయానికి గురై ఆరుతడి పంటలు వేయాలా వద్దా అని సందిగ్ధంలో పడ్డారని రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు దేవరం వెంకటరెడ్డి శనివారం ఒక ప్రకటన ద్వారా ఆవేదన వ్యక్తంచేశారు. అంతేగాకుండా గతంలో నాగార్జునసాగర్ లో 510 అడుగుల నీటిమట్టం ఉంటేనే సాగునీరు వారబంది ప్రకారం విడుదల చేస్తే రైతులు పంటలు పండించుకున్నారని, ప్రస్తుతం సాగర్ డ్యాంలో నీటిమట్టం 532అడుగులకు చేరినా సాగుకు నీరు ఎందుకు ఇవ్వడం లేదో తెలియని పరిస్థితి ఏర్పడిందని అన్నారు. సాగర్ ఆయకట్టు రైతులు లక్షల రూపాయలు ఖర్చులు పెట్టి బోర్లు బావుల ద్వారా అనేక వ్యయప్రయాసలకోర్చి నాట్లు వేస్తే అవి కూడా ఎండిపోయే పరిస్థితి ఏర్పడిందని, దీంతో రైతులు తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉంది కాబట్టి సాగర్ ఎడమ కాలువ ద్వారా వెంటనే నీటిని విడుదల చేసి ఆయకట్టు కింద ఉన్న చెరువులను కుంటలను నింపి సాగు త్రాగునీటి సమస్యను వెంటనే పరిష్కరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

### పాఠశాలలో బోనాలు వేడుకలు

# బోనం ఎత్తిన చిన్నారులు

## అమ్మవారు పోతురాజు వేషాలలో చిన్నారులు

**ఆత్మకూర్ (ఎం) జనంసాక్షి ఆగస్టు (22)** సరస్వతి విద్యాలయం ఇంగ్లీష్ మీడియం ఆత్మకూర్ పాఠశాలలో శ్రావణమాసం పురస్కరించుకొని అంబరాన్నంటిన బోనాల వేడుకలు. ఈ కార్యక్రమంలో చిన్నారులు వివిధ అమ్మవారు మరియు పోతురాజు వేషాల తో చూపరులను ఆకట్టుకున్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరెస్పాండెంట్ తౌర్ర విష్ణు పాఠశాల ప్రిన్సిపల్ పంజాల నరసయ్య మరియు వైస్ ప్రిన్సిపాల్ కొమరిశెట్టి ఐలయ్య ఉపాధ్యాయులు చెరుకు విష్ణు ,యాసిన్, సుధాకర్ ,లలిత సంతోష ,మహేశ్వరి ,సంధ్య, మాధవి, రేణుక ,లక్ష్మి, లావణ్య, స్వాతి ,రోజా లు పాల్గొన్నారు.



## పాముకాటు గురై వ్యక్తి మృతి



**అశ్వరావుపేట ఆగస్టు 22 (జనంసాక్షి):** అశ్వరావుపేట మండలం ఖమ్మంపాడు గ్రామానికి చెందిన పండు చిన రాముడు వయస్సు 36 సంవత్సరాలు గడిచిన రాత్రి 10:30 గంటల సమయం లో మృతుడు తన వరి వరి పొలానికి నీళ్లు పెడుతుండగా పాము కాటుకు గురైనాడు.ఈ క్రమంలో మృతుడి పక్క చేను రైతు మొడియం దుర్గారావు,గొంది సిరమయ్య లు అతని అరుపులు విని వెంటనే అతన్ని పెద్ద వాగు ప్రాజెక్టు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంకి తరలించగా మెరుగైన వైద్యం నిమిత్తము అశ్వరావుపేట హాస్పిటల్ కు వెళ్ళమని సూచించగా,మృతుని కుటుంబ సభ్యులు మద్దిగట్ల గ్రామంలో నాటు వైద్యం చేపించి ఇంటికి తీసుకెళ్లరు.ఈరోజు మృతుడి ఆరోగ్యం విషమించి, మరల వైద్యం నిమిత్తం అశ్వరావుపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా,వైద్యులు పరిశీలించి అతడిని మెరుగైన వైద్యం కోసం పెద్ద హాస్పిటల్ కు తీసుకెళ్ళమని చెప్పగా మృతుని తరలిస్తుండగా మార్గమధ్యంలో సత్తుపల్లి ఏరియా హాస్పిటల్ లో చేర్పించినారు.అప్పటికి డాక్టర్లు పరిశీలించి మధ్యాహ్నం రెండు గంటల సమయంలో మరణించినాడని నిర్ధారించినారు. మృతునికి భార్య,ఇద్దరు కుమార్తెలు కలరు. మృతుని అన్న పండు.నాగేశ్వరరావు ఫిర్యాదు పై ఎస్సై టి యయాతి రాజు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించినారు.

## మేడే కాలనీలో చేతి పంపు మరమ్మతు

**బూర్గంపహాడ్ ఆగస్టు 22 (జనంసాక్షి)** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, బూర్గంపహాడ్ మండలం సారపాక గ్రామపంచాయతీ పరిధిలోని మేడే కాలనీలో పనిచేయకుండా ఉన్న చేతి పంపును గ్రామపంచాయతీ సిబ్బంది మరమ్మతు చేసి వినియోగంలోకి తీసుకొచ్చారు. స్థానికుల నుంచి వచ్చిన ఫిర్యాదుపై స్పందించిన సర్పంచ్ కిశోర్ శివరామ్ నాయక్ వెంటనే సిబ్బందిని పంపించి అవసరమైన మరమ్మతులు చేయించారు. చేతి పంపు అందుబాటులోకి రావడంతో కాలనీ ప్రజలు, ముఖ్యంగా మహిళలు హర్షం వ్యక్తం చేశారు. తాగునీటి సమస్యను వెంటనే పరిష్కరించిన సర్పంచ్ కిశోర్ శివరామ్ నాయక్, పంచాయతీ కార్యదర్శి, సిబ్బందికి కాలనీ వాసులు కృతజ్ఞతలు తెలిపారు. ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు గుర్తించి పరిష్కరించేందుకు పంచాయతీ యంత్రాంగం చేస్తున్న కృషిని వారు అభినందించారు.



### సబ్సిడీపై ఆరుతడి విత్తనాలను

# సద్వినియోగం చేసుకోండి

## - మండల ప్రత్యేక అధికారి కె.మహాలక్ష్మి



**మునగాల, ఆగష్టు 22(జనంసాక్షి):** మండలంలో ఆరుతడి పంటలను ప్రోత్సహించాలనే ఉద్దేశంతో వ్యవసాయ శాఖ కంది, మినుముల విత్తనాలను సబ్సిడీపై కేటాయించిన కంది, మినుముల విత్తనాలను మండల ప్రత్యేక అధికారి, డిప్యూటీ సీఈవో జిల్లా పరిషత్ కె. మహాలక్ష్మి ఆధ్వర్యంలో మండల వ్యవసాయ అధికారి కార్యాలయంలో శనివారం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎల్ నినో ప్రభావం వల్ల సాధ్యమైనంతవరకు వరి పంటను తగ్గించుకొని ఆరుతడి పంటలు వేసుకోవడం వల్ల మాత్రమే రైతులు ఆదాయం పొందుతారని, సబ్సిడీ విత్తనాలను వినియోగించుకోవాలని, ఖాళీగా ఉన్న పొలాలలో తప్పనిసరిగా ఏదో ఒక ఆరుతడి పంట వేసుకొని రైతు లబ్ధి చేకూరాలని కోరారు. అనంతరం 200 కిలోల మినుము విత్తనాలు, 50 కిలోల కంది విత్తనాలు పంపిణీ చేశారు. విత్తనాలు కావాల్సిన రైతులు ముందుగా మునగాల వ్యవసాయ శాఖ కార్యాలయంలో దరఖాస్తు ఇచ్చినట్లయితే, విత్తనాలు వచ్చిన తర్వాత మొదటిగా సీరియల్ ప్రకారం రైతులకు ఇస్తామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ అభివృద్ధి అధికారి కె.రమేష్ దీన దయాళ్, మండల వ్యవసాయ అధికారి బి. రాజు, డిప్యూటీ తహసిల్దార్ సత్యనారాయణ, వ్యవసాయ విస్తరణ అధికారులు నాగు, సునీత, పంచాయతీ కార్యదర్శి చంద్రశేఖర్, రైతులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు న్యాయ హక్కులపై అవగాహన



**నేరేడుచర్ల, ఆగస్టు 22 (జనంసాక్షి) :** జాతీయ న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో మండల న్యాయ సేవా కమిటీ, హుజూర్‌నగర్ ఆధ్వర్యంలో నేరేడుచర్ల ప్రభుత్వ జూనియర్ కళాశాల, ప్రిన్సిపాల్ నీరజ అధ్యక్షతన శనివారం న్యాయ అవగాహన కార్యక్రమం. నిర్వహించారు.ఈ కార్యక్రమానికి హుజూర్‌నగర్ సబ్‌కోర్టు సివిల్ న్యాయమూర్తి ఎన్. శ్యామ్ సుందర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థులకు న్యాయ సేవలు, ప్రాథమిక హక్కులు, బాధ్యతలు,ఉచిత న్యాయ సహాయం, బాలల హక్కులు తదితర అంశాలపై అవగాహన కల్పించారు.హుజూర్‌నగర్ బార్ అసోసియేషన్ సెక్రటరీ, రమణారెడ్డి, నేరేడుచర్ల ఎస్ఐ గోపాల్ రెడ్డి, లీగల్ ఎయిడ్ అడ్వకేట్ కాల్వ శ్రీనివాసులు, ఈ సందర్భంగా విద్యార్థులు చట్టాలపై అవగాహన పెంపొందించుకోవడంతో పాటు, తమ హక్కులను తెలుసుకుని బాధ్యతాయుతమైన పౌరులుగా ఎదగాలని న్యాయ అధికారులు సూచించారు.ఈ కార్యక్రమంలో అధ్యాపకులు యమ్. సైదులు, ప్రణతి, వెంకన్న, సునీత,నరేందర్, ప్రసాద్,అంజయ్య, నరసించారి, వీరు,వెన్నల,లైబ్రేరియన్ జానకి రాంరెడ్డి, అధ్యాపకేతర సిబంది అన్వేష్,వెంకన్న,జాన్ ఆఫ్ ఖాన్,శ్రీను, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

## ఇకనుండి ప్రజావాణి రైతువేదిక

**ములకలపల్లి ఆగస్టు 22 జనంసాక్షి :** మండల కేంద్రం లోని మండల పరిషత్ కార్యాలయం లో ప్రతి సోమవారం ఉదయం 10 నుండి 1 వరకు జరుగు ప్రజావాణి కార్యక్రమం ఈ నెల 24 నుండి రైతువేదిక లో నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ సత్యనారాయణ తెలిపారు. ఎంపీడీఓ కార్యాలయానికి మరమ్మత్తులు జరగడం వలన వేదిక మార్చినట్లు ఆయన తెలిపారు. మండల ప్రజలు, మండల స్థాయి అధికారులు విషయాన్ని గమనించి సకాలంలో చేరుకోవాలని సూచించారు.

# ఘనంగా కలం యోధుడు సోయాబుల్లాఖాన్ వర్ధంతి





**ఖమ్మం కార్పొరేషన్ , ఆగస్టు 22 ( జనంసాక్షి)**
నిరంకుశత్వంపై అక్షరాన్నే ఆయుధంగా మలిచి, నిజాం పాలనకు వ్యతిరేకంగా పోరాడిన అసమాన కలం యోధుడు షహీద్ షోయబుల్లా ఖాన్. హైదరాబాద్ సంస్థానాన్ని భారత యూనియన్‌లో విలీనం చేయాలని, ప్రజాస్వామ్య పాలన రావాలని కోరుతూ తన రచనల ద్వారా ప్రజల్లో చైతన్యం తీసుకొచ్చిన ధీర జర్నలిస్టుగా ఆయన చరిత్రలో నిలిచిపోయారు.షోయబుల్లా ఖాన్ 1920 అక్టోబర్ 17న ఖమ్మం జిల్లాలోని సుబ్లేడు గ్రామంలో హబీబుల్లా ఖాన్, లాయహున్నిసా బేగం దంపతులకు జన్మించారు. ఆయన తండ్రి హబీబుల్లా ఖాన్ రైల్వే శాఖ లో పనిచేసేవారు. మహాత్మాగాంధీకి ఆయన వీరాభిమాని. గాంధీజీ పట్ల ఉన్న అభిమానంతో తన కుమారుడిని ప్రేమగా 'షోయబుల్లా గాంధీ' అని పిలిచేవారని చారిత్రక కథనాలు పేర్కొంటున్నాయి. బాల్యం నుంచే షోయబుల్లా ఖాన్ కు సమాజం పట్ల అవగాహన పెరిగింది. బొంబాయిలో ఇంటర్మీడియట్ వరకు చదువుకున్న ఆయన హైదరాబాద్ ఉస్మానియా విశ్వవిద్యాలయంలో బీ.ఏ తో పాటు జర్నలిజం విద్యను అభ్యసించారు. మంచి ఉద్యోగం పొందే అవకాశాలు ఉన్నప్పటికీ నిరంకుశ పాలనను ప్రశ్నించేందుకు జర్నలిజాన్ని తన వృత్తిగా ఎంచుకున్నారు.జాతీయ భావాలను ప్రోత్సహిస్తున్న 'తేజ్' ఉర్దూ వారపత్రికలో సబ్‌ఎడిటర్‌గా చేరిన షోయబుల్లా ఖాన్ నిజాం పాలకులు, వారి అనుచరులైన భూస్వాములు, రజాకారులు ప్రజలపై సాగిస్తున్న దురాగతాలను తన రచనల ద్వారా ఎండగట్టారు. ఆయన రచనలు నిజాం పాలకులకు ఆగ్రహం తెప్పించడంతో 'తేజ్' పత్రిక నిషేధానికి గురైంది.స్వయంగా జాతీయ భావాలతో కూడిన పత్రికను ప్రారంభించాలని నిర్ణయించుకున్న, షోయబుల్లా ఖాన్ తన తల్లి, భార్య నగలను విక్రయించి వచ్చిన డబ్బుతో, బూర్గుల రామకృష్ణారావు ఇంటిని అద్దెకు తీసుకుని 'ఇమ్రోజ్' అనే ఉర్దూ దినపత్రికను ప్రారంభించారు. 1947 నవంబర్ 15న 'ఇమ్రోజ్' తొలి సంచిక వెలువడింది.ఆర్థిక ఇబ్బందులు ఎదురైనా పత్రికను ప్రజల గొంతుకగా తీర్చిదిద్దారు. నిజాం నిరంకుశత్వం, రజాకారుల మతదురహంకారం, ప్రజలపై జరుగుతున్న దాడులను ఆయన తన సంపాదకీయాలు, కథనాల ద్వారా తీవ్రంగా విమర్శించారు.దేశానికి 1947 ఆగస్టు 15న స్వాతంత్ర్యం వచ్చినప్పటికీ హైదరాబాద్ సంస్థానాన్ని భారత యూనియన్‌లో విలీనం చేయడానికి నిజాం నిరాకరించాడు. ఈ పరిస్థితుల్లో హైదరాబాద్ సంస్థానం భారతదేశంలో విలీనం కావాలని షోయబుల్లా ఖాన్ 'ఇమ్రోజ్' ద్వారా బలంగా డిమాండ్ చేశారు.షోయబుల్లా ఖాన్ పై రజాకార్ల నాయకుడు ఖాసిం రజ్వీ నుంచి బెదిరింపులు వచ్చాయి. అయినప్పటికీ ఆయన తన రచనా పోరాటాన్ని ఆపలేదు. అన్యాయం ఎక్కడ జరిగినా అక్కడికి వెళ్లి వాస్తవాలను వెలుగులోకి తెచ్చారు.1948 ఆగస్టు 19న నిజాం వ్యతిరేకంగా వార్తలు, వ్యాసాలు రాస్తే చేతులు నరికేస్తామని, ఖాసిం రజ్వీ బహిరంగంగా హెచ్చరించినట్లు, చారిత్రక కథనాలు పేర్కొంటున్నాయి. అయితే షోయబుల్లా ఖాన్ మాత్రం వెనక్కి తగ్గలేదు. సత్యం కోసం పోరాడుతూ ప్రాణాలు కోల్పోవడం కూడా గర్వించదగ్గ విషయమేనని ఆయన ధైర్యంగా ప్రకటించారు.నిజాం నిరంకుశత్వాన్ని తన కలంతో సవాలు చేసిన షోయబుల్లా ఖాన్ 28 ఏళ్ల వయసులోనే 1948 ఆగస్టు 22న తుదిశ్వాస విడిచారు.షోయబుల్లా ఖాన్ తన మతానికి చెందిన నిజాం పాలకుడే అయినప్పటికీ నిరంకుశ పాలనను సమర్థించలేదు. రజాకారులు తన మతస్తులే అయినప్పటికీ వారి దారుణాలను ఖండించడంలో వెనుకాడలేదు. మతం పేరుతో జరిగే మతోన్మాదాన్ని ఆయన వ్యతిరేకించారు.పత్రికా స్వేచ్ఛ, ప్రజాస్వామిక విలువలు, లౌకిక భావాలు, ప్రజల హక్కుల కోసం తన కలాన్ని ఆయుధంగా మార్చుకున్న షోయబుల్లా ఖాన్ త్యాగం నేటి జర్నలిస్టులకు, ప్రజాస్వామ్య వాదులకు స్ఫూర్తిదాయకం. ఆగస్టు 22న ఆయన వర్ధంతి సందర్భంగా ఈ అసమాన కలం యోధుడి సేవలను స్మరించుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత.షోయబుల్లా ఖాన్ అమరత్వం ప్రజాస్వామ్య పోరాటానికి చిరస్మరణీయం.ఈ కార్యక్రమంలో టీడబ్ల్యూజేఎఫ్ హెచ్-2843 కోశాధికారి వేముల కొండ రమేష్, ఎలుగోటి వెంకట్, నల్లా రాకేష్ రెడ్డి, కాసోజు శ్రీధర్, అమరబోయిన ఉపేందర్, గంటేల కుమార్, కప్పల మధు గౌడ్, ప్రెస్ క్లబ్ అధ్యక్షులు అంతోటి శ్రీనివాస్, కిరణ్ కుమార్, గుజ్జు గోపాలకృష్ణ, చిన్నంశెట్టి రాంబాబు, పాగా యోనా, మేకల రవి, మొగిలి నాగేశ్వరరావు, షేక్ మీరా, ఎలిశెట్టి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.




## నూతన గ్రంథాలయ భవనాన్ని పరిశీలించిన మున్సిపల్ చైర్మన్,కమిషనర్

**నేరేడుచర్ల ఆగస్టు 21 (జనంసాక్షి)**
నేరేడుచర్ల పట్టణంలో నూతనంగా గ్రంథాలయ భవనాన్ని నిర్మించారు.ఈ నేపథ్యంలో శుక్రవారం మున్సిపల్ చైర్మన్ కొణతం చిన్న వెంకట్ రెడ్డి,మున్సిపల్ కమిషనర్ సి.హెచ్.నాగరాజు గ్రంథాలయ భవనాన్ని సందర్శించి,పరిశీలించారు.ఈ సందర్భంగా గ్రంథాలయంలో జరిగిన పనులను,కావలసిన వసతులు అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పట్టణంలో నూతనంగా నిర్మించిన గ్రంథాలయ భవనం ఎంతో మంది విద్యార్థులు, వృద్ధులు,తదితరులు పేపర్ ఇతర పుస్తకాలు చదవడానికి ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు.భవనానికి ముందు ప్రహరీ గోడ,కింద కాంక్రీట్,కిటికీలకు రక్షణగా గ్రిల్స్ మరియు ముందు గేట్ గురించి జిల్లా కలెక్టర్ తో మాట్లాడి కావలసిన వసతులను ఏర్పాటు చేస్తామన్నారు.ఈ కార్యక్రమంలో గ్రంథాలయ సిబ్బంది హుస్సేన్, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

## నూతన గ్రామ పంచాయతీ భవనానికి శంకుస్థాపన



**మునగాల, ఆగష్టు 22 (జనంసాక్షి):** మండల పరిధిలోని ఈదులవాగు తండా గ్రామంలో కోదాడ నియోజకవర్గ ఎమ్మెల్యే ఎన్. ఉత్తమ్ పద్మావతి రెడ్డి సహకారంతో మంజూరు చేసిన నూతన గ్రామ పంచాయతీ భవనానికి శనివారం మునగాల మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కాసర్ల కోటయ్య శంఖుస్థాపనకు సంభందించిన పూజలు నిర్వహించి శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ బానోతు పున్నమ్మసుధాకర్, ఉపసర్పంచ్ బోడ రవి, గ్రామ పంచాయతీ వార్డు మెంబర్లు, మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షులు సాయి, కార్యకర్తలు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.


## ముత్తారెడ్డి మరణం పార్టీకి తీరని లోటు

### సర్పంచ్ మహేశ్వరం మల్లికార్జున్



**నూతనకల్,ఆగష్టు 22 (జనంసాక్షి)**
నూతనకల్ మండల కేంద్రంలో కొంతకాలంగా అనారోగ్యంతో ఇబ్బంది పడుతూ బిఆర్ఎస్ నాయకుడు తిమ్మారెడ్డి ముత్తారెడ్డి శనివారం తెల్లవారుజామున తుది శ్వాస విడిచారు.సర్పంచ్ మహేశ్వరం మల్లికార్జున్ మృతుని పార్థివ దేహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు ఆయన కుటుంబానికి మరియు కుమారుడు మాజీ ఉపసర్పంచ్ ఇంమ్మారెడ్డి లింగారెడ్డి ని ఓదార్చారు. ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా నాయకుడు కాప రవికుమార్,వార్డు సభ్యులు గోవర్ధన్ ఉప్పుల వీరస్వామి సంగినేని సురేందర్ బిఆర్ఎస్ గ్రామ శాఖ అధ్యక్షుడు మొగుళ్ళ వెంకన్న గౌడ్ వెంకట్ రెడ్డి యాదగిరి లింగయ్య పేరం రమేష్ శ్రీను తదితరులు పాల్గొన్నారు.

## జాతీయస్థాయి అంతరిక్ష సదస్సుకు ఎంపికైన కోదాడ తేజ విద్యార్థి



**కోదాడ( జనంసాక్షి):** భారత అంతరిక్ష పరిశోధన కేంద్రం, మరియు జాతీయ విద్యా పరిశోధన శిక్షణా సంస్థ సంయుక్తంగా అంతరిక్షయానం మీద అవగాహన పెంచడం కోసం దేశవ్యాప్తంగా పాఠశాల విద్యార్థులకు ఆన్లైన్ ద్వారా ఆగస్టు 17 న విక్రం సారాభాయ్ అంతరిక్ష క్విజ్ పేరు మీద పోటీ నిర్వహించడం జరిగింది.దేశ వ్యాప్తంగా వేల మంది పాల్గొన్న ఈ పోటీలో అత్యుత్తమంగా నిలిచిన 30 మంది విద్యార్థులను ఎంపిక చేసి ఆగస్టు 23 జాతీయ అంతరిక్ష దినోత్సవం సందర్భంగా అహ్మదాబాద్ లో జరిగే అంతరిక్ష సదస్సుకు ఆహ్వానించడం జరిగింది. సూర్యాపేట జిల్లా కోదాడ తేజ విద్యాలయలో 10వ తరగతి చదువుతున్న కత్తి అక్షయ్ రెడ్డి ఈ పోటీల్లో పాల్గొని అత్యుత్తమ 30మందిలో ఒక్కడిగా నిలిచి అంతరిక్ష సదస్సుకు ఎంపికైనట్లు పాఠశాల ప్రిన్సిపాల్ ఉస్తేల రమాసోమిరెడ్డి తెలిపారు.ఈ సదస్సుకు ఎంపికైన విద్యార్థి అక్షయ్ తో పాటు కిషోర్ రెడ్డి అనే ఉపాధ్యాయుడు ఈ సదస్సుకు హాజరవుతారు. ఈ సందర్భంగా కత్తి అక్షయ్ రెడ్డిని ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు మరియు పట్టణ ప్రముఖులు అభినందించారు.




## సురవరం ఉద్యమ స్ఫూర్తితో ప్రజా సమస్యలపై పోరాడాలి

**సంస్థాన్ నారాయణపురం. ఆగస్టు 22. ( జనం సాక్షి):**
సురవరం సుధాకర్ రెడ్డి ఉద్యమ స్ఫూర్తితో ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడాలని సిపిఐ మండల కార్యదర్శి దుబ్బాక భాస్కర్ కార్యకర్తలకు పిలుపునిచ్చారు. శనివారం నారాయణపురం మండల కేంద్రంలోని సిపిఐ కార్యాలయంలో సురవరం ప్రథమ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సురవరం విద్యార్థి దశ నుండి పోరాటపటిమ అలవర్చుకొని ఏఐఎస్ఎఫ్ జాతీయ కార్యదర్శిగా , ఏఐఎస్ఎఫ్ జాతీయ కార్యదర్శిగా పనిచేస్తున్న సమయంలో యువజన సమస్యలపై నిత్యం పోరాడేవారని, యువజన విద్యార్థి నాయకునిగా అనేక దేశాల్లో పర్యటించి యువత ఎదుర్కొంటున్న సవాళ్లను ప్రపంచ వేదికల మీద మాట్లాడినారని ,18 సంవత్సరాలకే ఓటు హక్కు కల్పించాలని, పోరాడి సాధించడం జరిగింది. అదేవిధంగా పార్లమెంటు సభ్యులుగా యూపీఏ హయాంలో అసంఘటిత రంగ కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని, జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం రూపొందించి పేదలను ఆదుకోవాలని , ఆహార భద్రత చట్టాన్ని అమలుచేసి దేశంలో ఉన్న నిరుపేదలను , వ్యవసాయ కార్మికులను ఆదుకోవడం కోసం ఈ యొక్క పథకాన్ని రూపకల్పన చేయడంలో ప్రముఖ పాత్ర పోషించి నారు. సిపిఐ జాతీయ ప్రధాన కార్యదర్శిగా ఉంటూ కమ్యూనిస్టు పార్టీని బలోపేతం చేయడం కోసం నిరంతరం శ్రమించారు. నమ్మిన సిద్ధాంతం కోసం విద్యార్థి సంఘం నుంచి మొదలైన ఆయన ప్రస్థానం జాతీయ కార్యదర్శి వరకు ఒకే పార్టీలో ఉంటూ నిరాడంబరమైన జీవితాన్ని గడిపారని, నేటి యువత ఆయన జీవితాన్ని స్ఫూర్తిగా తీసుకొని ప్రజా సమస్యలపై మరింత ఉధృతంగా పోరాడాలని ఆయన కోరారు.ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా సమితి సభ్యులు చిలువేరు అంజయ్య , కలకొండ సంజీవ , మండల కార్యవర్గ సభ్యులు వీరమల్ల యాదయ్య , మహ్మదాబాద్ సర్పంచ్ ముత్యాల అంజయ్య, పందుల యాదగిరి, కొర్ర లాలు, కొర్ర లచ్చిరాం, పబ్బు మారయ్య, పల్లె రాములు , కందుల మోహన్ తదితరులు పాల్గొన్నారు.

# అర్హులైన ఓటర్లు తమ ఓటు హక్కును కోల్పోకుండా చూడాలి

## -మాజీ ఎమ్మెల్యే సంకినేని వెంకటేశ్వరరావు



**సూర్యాపేట (జనంసాక్షి):**
ఓటర్ల జాబితా సవరణ అనేది ప్రజాస్వామ్యంలో అత్యంత కీలకమైన ఘట్టమని, ఇందులో ఏ ఒక్క అర్హుడైన ఓటరు కూడా తన ఓటు హక్కును కోల్పోకూడదని మాజీ ఎమ్మెల్యే సంకినేని వెంకటేశ్వరరావు అన్నారు. శనివారం బీజేపీ పట్టణ కార్యాలయంలో ఓటర్ లిస్ట్ సవరణ సర్ 2పై కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ప్రస్తుతం కొనసాగుతున్న సర్ ప్రక్రియలోని రెండవ దశ ప్రాధాన్యతను ఆయన వివరించారు. వివిధ కారణాలతో నోటీసులు వచ్చిన ప్రతి సందర్భం లోనూ క్షేత్రస్థాయిలో బీఎల్ఏ 2లు వెంటనే స్పందించాలన్నారు. సదరు ఓటరుకు పూర్తి అండగా నిలిచి, ఎన్నికల అధికారులకు సరైన వివరణలు, ఆధారాలను సమర్పించాలన్నారు. ఏ ఒక్క జాతీయవాద ఓటు కూడా జాబితా నుండి గల్లంతు కాకుండా కాపాడాల్సిన పూర్తి బాధ్యత బూత్ స్థాయి ఏజెంట్లపైనే ఉందని అన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రతిపాదించిన శంషాబాద్ నుండి చెన్నై బుల్లెట్ ట్రైన్ ప్రాజెక్టు సూర్యాపేట పట్టణం మీదుగా వెళ్లేలా తాము గట్టి ప్రయత్నాలు చేస్తున్నట్లు వెల్లడించారు. అలైన్మెంట్, ప్రాథమిక సర్వే మ్యాప్‌ల ప్రకారం ఈ బుల్లెట్ రైలు కారిడార్ సూర్యాపేట గుండా సాగేలా చూసేందుకు కేంద్ర ప్రభుత్వ పెద్దలను, రైల్వే ఉన్నతాధికారులను త్వరలోనే స్వయంగా కలవనున్నట్లు పేర్కొన్నారు. ఈ విషయమై ఇప్పటికే కేంద్ర మంత్రి కిషన్ రెడ్డిని కలిసి ప్రాథమికంగా చర్చించినట్లు తెలిపారు. రాష్ట్రానికి చెందిన బీజేపీ ఎంపీలతో కూడా మాట్లాడడం జరిగిందన్నారు. సూర్యాపేట ప్రజల దశాబ్దాల రైల్వే కల నెరవేరడమే కాకుండా, బుల్లెట్ ట్రైన్ వంటి మెగా ప్రాజెక్టు ఇక్కడికి వస్తే జిల్లా పారిశ్రామికంగా, ఆర్థికంగా ఊహించని స్థాయికి ఎదుగుతుంద న్నారు. దశాబ్దాలుగా అధికారంలో ఉన్న కాంగ్రెస్ పాలకులు సూర్యాపేట ప్రాంతానికి తీవ్రమైన అన్యాయం చేశారని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వాల ఉదాసీనత వల్లే సూర్యాపేట కు ఇంత వరకు రైల్వే లైన్ రాలేదన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి చల్లమల్ల నరసింహ, మైనారిటీ మోర్చా రాష్ట్ర కార్యదర్శి ఎండి అబిద్, జిల్లా నాయకులు సలిగంటి వీరేందర్, మండల పార్టీ అధ్యక్షులు అలుగుబెల్లి సైదిరెడ్డి, మాధవరపు అనిల్, జిల్లా కౌన్సిల్ సభ్యులు పందిరి రాంరెడ్డి, పేర్వాల లక్ష్మణరావు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.



## సాగర్ ఎడమ కాలువ ద్వారా నీటిని విడుదల చేసి పంటలు కాపాడాలి

## పోసన బోయిన హుస్సేన్

**హుజూర్ నగర్ రూరల్, ఆగస్టు 22 (జనంసాక్షి):**
నాగార్జునసాగర్ ఎడమ కాలువ ద్వారా వెంటనే నీటిని విడుదల చేసి చెరువులు, కుంటలు పంట పొలాలను కాపాడాలని సిపిఎం మండల కార్యదర్శి పోసన బోయిన హుస్సేన్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం మండల పరిధిలోని గోపాలపురం గ్రామంలో ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సాగర్ లో నీటిమట్టం రోజురోజుకు పెరుగుతున్నందున పెరిగిన నీటిని దృష్టిలో ఉంచుకొని ప్రస్తుతం 530 అడుగులు నీరు ఉన్నందున ప్రభుత్వం వెంటనే నీటి విడుదలకు చర్యలు తీసుకోవాలని, వేసిన పంటలను కాపాడటంతో పాటు చెరువులు, కుంటలు నింపి ప్రజల దాహార్తిని తీర్చాలని హుస్సేన్ డిమాండ్ చేశారు. జిల్లావ్యాప్తంగా హుజూర్ నగర్, కోదాడ ప్రాంతాలలో వేలాది ఎకరాలు వరి సాగులో ఉందని వేసిన నాట్లు ఎండిపోతున్నాయని రైతాంగం అంతా ఆందోళన చెందుతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. నీటిని విడుదల చేసి చివరి ఆయకట్టు వరకు నీరు అందించాలని ఆయన డిమాండ్ చేశారు. అట్లాగే జిల్లాలో తీవ్రమైన వర్షాభావ పరిస్థితి ఏర్పడ్డాయని నాగార్జునసాగర్ ఆయకట్టు ప్రాంతాలను కరువు ప్రాంతాలుగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. గతంలో 510 అడుగులు ఉన్న నీరు ఇచ్చారని ఇప్పుడు ప్రస్తుతం 530 అడుగుల దాకా చేరాయని వెంటనే నీటిని విడుదల చేసి రైతులను ఆదుకోవాలని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో శాఖ కార్యదర్శి సిద్దుల వెంకటయ్య, చందాల బిక్షం, మేగద రాములు, అన్నపునేని మాధవరావు, బండి గోపి, కాలవ వెంకటేశ్వర్లు, అనంతుల వెంకట్, నారాయణ, కోటేశ్వరరావు, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.




## రాచకొండ ఎత్తిపోతల పథకానికి నిధులు మంజూరు చేసి వెంటనే విడుదల చేయాలి..

## - సిపిఎం మండల కమిటీ..

**సంస్థాన్ నారాయణపురం. ఆగస్టు 22. (జనం సాక్షి):**
సంస్థాన్ నారాయణపురం మండల కేంద్రంలో సిపిఎం మండల కమిటీ ఆధ్వర్యంలో నారాయణపురం మండలానికి సాగునీరు కావాలని, శివన్నగూడెం ప్రాజెక్టును పూర్తి చేసి రాచకొండ ఎత్తిపోతల పథకానికి నిధులను మంజూరు చేసి వెంటనే విడుదల చేయాలని, కోరుతూ, సంతకాల సేకరణ చేయడం జరిగింది. ఈ మండల రైతులు చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నది. ఎన్నో ప్రభుత్వాలు వచ్చిన సాగునీటి కాలువలు ఇస్తామని ఇవ్వటం లేదు అని నాయకులు అన్నారు. ఈ మండల ప్రాంత ప్రజలు కేవలం వర్షాధార మీదనే ఆధారపడి వ్యవసాయం చేసుకుంటున్నారని, దీనివలన ప్రతి ఐదు సంవత్సరాలకు నాలుగు సంవత్సరాలు కరువు ఏర్పడి రైతులు వేసిన పంటలు కు పెట్టిన పెట్టుబడి ఎల్లక అప్పుల పాలై ఆత్మహత్యలు గురవుతున్న ప్రభుత్వాలు నిమ్మకు నీరెత్తకుండా ఈ ప్రాంత ప్రజలను చాలా ఇబ్బందులకు గురిచేస్తున్నారని అన్నారు. దీనివలన మండలంలోని వ్యవసాయ కార్మికులకు జీవనోపాధి కోసం ఇతర ప్రాంతాలకు వలస వెళ్లవలసి వస్తుందని,ఎన్నో సంవత్సరాలుగా ప్రజలు ఆశించిన విధంగా ప్రభుత్వాలు సాగునీటి ప్రాజెక్టుల్లో నిర్మించక ఇచ్చిన వాగ్దానాలు అమలు చేయక ప్రజలను తీవ్రమైన ఇబ్బందులకు గురి చేస్తున్నారని, వెంటనే మండలానికి సాగునీరుని శివన్నగూడెం ప్రాజెక్టు పూర్తి చేసి రాచకొండ ఎత్తిపోతల పథకానికి నిధులు మంజూరు చేస్తూ వెంటనే పనులు నిర్మించాలని, ప్రభుత్వాన్ని కోరుతున్నాం ఈ సంతకాల సేకరణ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు గుంటోజు శ్రీనివాసాచారి, సిపిఎం మండల కార్యదర్శి దోడ యాదిరెడ్డి, సిపిఎం జిల్లా కమిటీ సభ్యురాలు మల్లేపల్లి లలిత, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు దోనూరు నర్సిరెడ్డి, సిపిఐ మండల కార్యదర్శి వర్గ సభ్యులు పిట్ట రాములు, చింతకాయల నరసింహ, మండల కమిటీ సభ్యులు చాడ నర్సింహ,రాచకొండ కృష్ణ, దొంతగోని శంకరయ్య, కొమ్ము మల్లేష్, బొడ్డు పెళ్లి లాలయ్య,తుమ్మల నర్సిరెడ్డి, ఎలిమినేటి బసవ రెడ్డి, ఎలిమినేటి నర్సిరెడ్డి, దోనూరు నారాయణరెడ్డి, సుర్కంటి పాపిరెడ్డి, సిరిపంగి రామచంద్రం, తదితరులు పాల్గొన్నారు.



## అర్వపల్లి వైన్స్ లో చోరీ

**జాజిరెడ్డిగూడెం మండల ఆగస్టు 18 జనంసాక్షి:**
అర్వపల్లి లోని రసిత-1 వైన్స్ లో వారం రాత్రి దొంగలు చోరీకి పాల్పడ్డారు. గుర్తు తెలియని ఇద్దరు వ్యక్తులు ముఖాలకు ముసుగులు ధరించి దుకాణం షెటర్ రాడుతో పైకి లేపి లోనికి ప్రవేశించారు. దుకాణంలో సుమారు 30 వేల నగదు, రూ. 23 వేల విలువచేసే మద్యం బాటిల్లను బస్తాలో వేసుకొని వెళ్లారు. సీసీ కెమెరాలో రికార్డు కాకుండా భవనం ముందుభాగం ఉన్న లైట్లను బంద్ చేసి, వేలి ముద్రల ఆనవాళ్ళు కనిపించకుండా చేతికి గ్లౌజులు వేసుకొని చోరీకి ప్రయత్నించారు. దుకాణం లోపల ఉన్న సీసీ కెమెరాలో రికార్డు అయింది. ఈమద్యం దుఖాణాన్ని నా గారం సిఐ నాగేశ్వరరావు స్థానిక ఎస్సై మధు శనివారం సందర్శించి వివరాలను తెలుసుకున్నారు. సూర్యాపేట నుంచి క్లూస్ టీం సీసీఎస్ పోలీసులు వచ్చి విచారణ చేశారు. సీసీ ఫుటేజిని పోలీసులు సేకరించుకుని వెళ్లారు. కాగా దుకాణం నిర్వాహ కుడు మట్టపల్లి సుధాకర్ స్థానిక పోలీసులకు చోరీ పై ఫిర్యాదు చేశారు.

## ప్రణవానంద ప్రభూజి ప్రవచనం జయప్రదం చేయండి

## రామాలయ కోశాధికారి రేపాల వెంకన్న

**హాలియా, జనం సాక్షి ఆగస్టు 22:**



ప్రణవానంద ప్రబుజీ చేత ఆదివారం సాయంత్రం హాలియా రామాలయంలో నిర్వహించే దివ్య ప్రవచనానికి పరిసర ప్రాంత భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని హాలియా శ్రీ సీతారామచంద్రస్వామి సహిత శ్రీ స్వయంభు భక్తాంజనేయ స్వామి దేవస్థానం చైర్మన్ మేడేపల్లి మోహన్ రావు కోశాధికారి రేపాల వెంకన్న శనివారం ఒక ప్రకటనలో కోరారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మాజీ సీఎల్పీ నేత కుందూరు జానారెడ్డి, ఎంపీ కుందూరు రఘువీర్ రెడ్డి, ఎమ్మెల్యే కుందూరు జైవీర్ రెడ్డి, ఎమ్మెల్సీలు ఎంసి కోటిరెడ్డి, కేతావత్ శంకర్ నాయక్, మార్కెట్ చైర్మన్ తుమ్మలపల్లి చంద్రశేఖర్ రెడ్డి, మున్సిపల్ చైర్మన్ చింతల చంద్రరెడ్డి, వైస్ చైర్మన్ గౌని రాజా రమేష్ యాదవ్, పారిశ్రామికవేత్త చిట్టిపోలు యాదగిరి, కొత్తపల్లి పిఏసిఎస్ చైర్మన్ రిక్కల మధుసూదన్ రెడ్డిలు అతిథులుగా హాజరు కానున్నారని తెలిపారు ఆధ్యాత్మికతతోనే మానసిక ప్రశాంతత ఏర్పడుతుందని మహిళలు, భక్తులు స్వామివారి దివ్య ప్రవచనానికి హాజరుకావాలని కోరారు. అదేవిధంగా కోలాటాలు చెక్కభజనలచే స్వామివారికి, అతిథులకు ఘన స్వాగతం, వివిధ పాఠశాలల విద్యార్థులచే సాంస్కృతిక నృత్య ప్రదర్శనలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.




## ఆపరేషన్ చబుత్రాతో అసాంఘిక కార్యకలాపాలకు అడ్డుకట్ట

### హాలియాలో 25 మందికి కౌన్సెలింగ్..

### 11 వాహనాలు అదుపులోకి

**హాలియా, ఆగస్టు 18 జనంసాక్షి:**
రాత్రివేళల్లో యువత అనవసరంగా గుమిగూడడం, బహిరంగ ప్రదేశాల్లో ఇబ్బందులు కలిగించడం, శాంతిభద్రతలకు విఘాతం కలిగించే చర్యలను అరికట్టేందుకు ఆపరేషన్ చబుత్రాలో భాగంగా ప్రత్యేక తనిఖీలు నిర్వహించినట్లు హాలియా ఎస్సై బి. సాయి ప్రశాంత్ తెలిపారు.
హాలియా పట్టణంలో నిర్వహించిన ప్రత్యేక తనిఖీల్లో అనుమానాస్పదంగా సంచరిస్తున్న యువకులను, ఇతర వ్యక్తులను గుర్తించి మొత్తం 25 మందికి కౌన్సెలింగ్ నిర్వహించినట్లు చెప్పారు. నిబంధనలకు విరుద్ధంగా ఉన్న 10 ద్విచక్ర వాహనాలు, ఒక కారును అదుపులోకి తీసుకుని తదుపరి చర్యల కోసం పరిశీలిస్తున్నట్లు తెలిపారు. రాత్రివేళల్లో అనవసరంగా గుమిగూడి ప్రజలకు ఇబ్బందులు కలిగిస్తే చర్యలు తప్పవని ఎస్సై హెచ్చరించారు. మద్యం సేవించి వాహనాలు నడపడం, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడటం, శాంతిభద్రతలకు విఘాతం కలిగించడం వంటి చర్యలకు దూరంగా ఉండాలని యువతకు సూచించారు. ప్రజలు పోలీసులకు సహకరించాలని, అనుమానాస్పద వ్యక్తులు లేదా అసాంఘిక కార్యకలాపాలు కనిపిస్తే వెంటనే పోలీసుల దృష్టికి తీసుకురావాలని ఎస్సై సాయి ప్రశాంత్ కోరారు. రాత్రివేళల్లో ప్రత్యేక గస్తీ కొనసాగిస్తామని, నిబంధనలు ఉల్లంఘించే వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.